Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 15.06.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 02 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



- రాయలసీమ నుండి కోనసీమ దాకా జన జాతర
- జననేతకు హారతి పట్టిన గోదావరి జిల్లాలు
- గోదావరిలో వైసిపికి ఊపొచ్చింది
- రాష్ట్ర రాజకీయాలలో ఈ జిల్లాలే కీలకం

## నడిచేకొద్దీ...
# నాయకుడిగా ఎదుగుతూ..
## ప్రజల గుండెల్లో ఒదుగుతూ...

**ఉభయగోదావరి జిల్లాలు. పాడిపంటలకు, పచ్చని పైర్లకు, గలగల పారే కాలువలకు, కొబ్బరిచెట్లతో నిండిన కోనసీమ అందాలకు, నోరూరించే కాజాలు, పూతరేకులకు, పంచారామ క్షేత్రాలకు వేదికలు. ఈ జిల్లాలు ఇంతవరకే పరిమితమా? కానే కాదు. రాష్ట్ర రాజకీయాలను శాసించగల శక్తి వున్న జిల్లాలు. ఎవరిని అధికారంలో కూర్చోబెట్టాలో, ఎవర్ని ప్రతిపక్షంలో నిలబెట్టాలో నిర్ణయించే జిల్లాలు.**

294 సీట్లున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వేరు. విభజన అనంతరం 175 సీట్లతో మిగిలిన ఆంధ్రప్రదేశ్ వేరు. చిన్న రాష్ట్రంగా ఏర్పడ్డాకే ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి జిల్లాల ప్రాధాన్యత పెరిగింది. రాష్ట్రంలో 13జిల్లాలు, 175 నియోజకవర్గాలు. ఒక్క పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లోనే 34 అసెంబ్లీ సీట్లున్నాయి. ఈ రెండు జిల్లాల్లో మెజార్టీ సీట్లు సాధించిన పార్టీయే రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి అవకాశం ఉంటుంది. 2014 ఎన్నికల్లో జరిగింది కూడా ఇదే! రాయలసీమలోనే కాకుండా నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోనూ వైసిపి మెజార్టీ స్థానాలు సాధించగలిగింది. కాని ఉభయగోదావరి జిల్లాలు తెలుగుదేశంకు జై కొట్టాయి. ఈ రెండు జిల్లాల్లోనూ టీడీపీ దాదాపు క్లీన్‌స్వీప్ చేసింది. ఈ రెండు జిల్లాల్లో వచ్చిన సీట్ల వల్లే వైసిపి కంటే టీడీపీ ముందంజలో నిలిచింది. ఆరోజు పరిస్థితులు టీడీపీకి అనుకూలించాయి. నరేంద్ర మోడీ ఇమేజ్‌తో పాటు ఈ రెండు జిల్లాల్లో బలంగా వుండే కాపు సామాజికవర్గం, పవన్ పుణ్యాన టీడీపీ వైపు మొగ్గు చూపింది. అలాగే కొన్ని విషప్రచారాల వల్ల కూడా ఈ జిల్లాల్లో పెద్దసంఖ్యలో వుండే రాజులు సైతం వైసిపికి వ్యతిరేకంగా ఓటేసారు. ఇది గత చరిత్ర... మరి గోదావరి రేపు ఎవరికి హారతి పట్టబోతుంది? ఎవరిని ఆదరించబోతుంది? (మిగతా 11వ పేజీలో)




## స్థానిక పోరుకు..
# వెనకడుగు

- ప్రతికూల ఫలితాలొస్తే అసలుకే ఎసరని బాబు భయం

***2014*** ***ఎన్నికల్లో వైసిపి పరాజయానికి టీడీపీ విజయానికి అనేక కారణాలున్నాయి. మోడీ ఇమేజ్, పవన్‌కళ్యాణ్ మద్దతు, ఋణమాఫీ, చంద్రబాబు అనుభవం, జగన్‌పై అవినీతి కేసులు, అతనిపై మతపరమైన ముద్ర... ఇతరత్రా కారణాలు. ఇవే కాదు, తెలుగుదేశం అధికారంలోకి రావడానికి కోర్టులు కూడా పరోక్షంగా దోహదం చేసాయి.***

అదెలాగంటే... 2014 అసెంబ్లీ ఎన్నికలకు ముందు స్థానిక ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచన ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు, అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ కూడా ఇచ్చేసారు. అయితే కొందరు వేసిన పిటిషన్‌లను విచారించిన హైకోర్టు, అసెంబ్లీ ఎన్నికలకంటే ముందే స్థానిక సంస్థల (మిగతా 11వ పేజీలో)

- పోలవరంపై కొత్త డ్రామా



## పని గడ్కరీది..
# ఫోజు బాబుది!

**పోలవరం... ఆంధ్రప్రదేశ్‌కు వరం. తెలుగు ప్రజల చిరకాల స్వప్నం. ఈ ఒక్క ప్రాజెక్ట్ పూర్తయితే రాష్ట్రంలో ఎన్నో జిల్లాలకు సాగునీరు, తాగునీరు ఇబ్బందులుండవు.**

ఈ ప్రాజెక్ట్ ప్రాధాన్యతను గుర్తించాడు కాబట్టే దివంగత నేత వై.యస్. రాజశేఖరరెడ్డి తన హయాంలోనే పోలవరం ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టాడు. ఏ ప్రాజెక్ట్‌లోనైనా ప్రధాన అంకం కాలువల నిర్మాణం. డ్యాం అన్నది ఒక చోట కట్టడానికి నిర్ణయించబడుతుంది. అది ఎప్పుడైనా కట్టుకోవచ్చు. కాని ఏళ్ళ తరబడి కట్టాల్సింది, కొన్నేసిసార్లు కోర్టుల్లో కేసుల వల్ల ఆగేది కాలువల నిర్మాణమే! అదీగాక కాలువల నిర్మాణానికి భూసేకరణ కూడా పెద్ద సమస్య. దీన్ని పసిగట్టాడు కాబట్టే వై.యస్. ముందుగా పోలవరం కాలువలను మొదలుపెట్టించాడు. కాలువలు పూర్తయ్యాక డ్యాం నిర్మాణం చేపట్టాలన్నది ఆయన ప్రణాళిక. దురదృష్టవశాత్తు 90శాతం కాలువలు నిర్మాణం జరగ్గానే ఆయన (మిగతా 11వ పేజీలో)



# నెల్లూరురూరల్ క్రికెట్ టోర్నమెంట్

మన మను ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23, 24 తేదీలలో నెల్లూరులోని ఏ.సి సుబ్బారెడ్డి స్టేడియంలో నెల్లూరురూరల్ క్రికెట్ టోర్నమెంట్ ఛాంపియన్‌షిప్ లీగ్ జరుగనుంది. నెల్లూరురూరల్‌లో వున్న 18ఏళ్ళు దాటిన క్రికెట్ క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనవచ్చు. 26కిపైగా టీమ్‌లతో ఈ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు 50వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు 20వేల నగదు బహుమతి అందించనున్నారు. పోటీలలో పాల్గొనదలచిన జట్లకు ఎలాంటి ప్రవేశ రుసుం లేదు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన జట్లు 7348915785, 9963201898, 9502016845, 0861-2351717 నెంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# విజయ లేబొరేటరీ 33వ వార్షికోత్సవం


డాక్టర్ ఎం.పెంచలరెడ్డి

నెల్లూరులోని ప్రసిద్ధమైన విజయ లేబొరేటరీ 33వ వార్షికోత్సవం ఈ నెల 16న జరుగనుంది. 1985 జూన్ 16న ఈ లేబొరేటరీ స్థాపించడం జరిగింది. సింహపురిలో ఇదే తొలి పాథాలజీ లేబొరేటరీ అని, దీనిద్వారా గడచిన 33 ఏళ్ళలో అయిదున్నర లక్షల మందికి పైగానే రోగనిర్ధారణ పరీక్షలు చేశామని లేబొరేటరీ నిర్వాహకులు డాక్టర్ ఎం. పెంచలరెడ్డి తెలియజేశారు. విజయ లేబొరేటరీ, క్యాన్సర్ నిర్ధారణ కేంద్రానికి అనుబంధంగా 2000 వ సంవత్సరంలో ఒబిసిటీ క్లినిక్ స్థాపించి, గత 18 సంవత్సరాలుగా వేలాదిమంది స్థూలకాయులకు శాస్త్రీయపద్ధతుల ద్వారా బరువు తగ్గించామన్నారు. ప్రత్యేకమైన రోగనిర్ధారణ పరీక్షలు, థైరాయిడ్, హార్మోనల్ రిపోర్టులు ఆన్‌లైనా ద్వారా కేవలం 48 గంటల్లోనే ఇస్తామన్నారు. వీటితో పాటు విజయ హెల్త్ సెంటర్, లైఫ్‌స్టైల్ క్లినిక్ అండ్ యోగా సెంటర్, సుశ్రుత ప్లాస్టిక్ సర్జరీ అండ్ కాస్మటాలజీ క్లినిక్ ఏర్పాటుచేసి వైద్యరంగంలో తమ సేవలందిస్తున్నామన్నారు. విజయ లేబొరేటరి 33వ వార్షికోత్సవం సందర్భంగా రోగనిర్ధారణ పరీక్షలకు, అధిక బరువు, లావు తగ్గింపుకు 20 శాతం డిస్కౌంట్ ఇస్తామని, కొద్దిరోజులు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని, ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# 19 నుంచి చాముండేశ్వరి బ్రహ్మోత్సవాలు

ప్రముఖ పుణ్యక్షేత్రం..ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామంలో వెలసివున్న శ్రీ చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 19 నుంచి 30వతేది వరకు ఎంతో వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇ.ఓ రవీంద్రరెడ్డి తెలియజేశారు. ఈ ఉత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు కనుక, భక్తుల కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 12వ తేదీ ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతిరోజూ వాహనోత్సవాలతో పాటు, 27న కళ్యాణోత్సవం, 28న వసంతోత్సవం, గంధోత్సవం, త్రిశూలేశ్వరోత్సవం నిర్వహిస్తామని, 29న సముద్రస్నానం, రథోత్సవం, నిప్పులగుండం ఉంటాయని, 30న అంగరంగవైభవంగా అమ్మవారికి తెప్పోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులందరూ విచ్చేసి అమ్మవారి బ్రహ్మోత్సవాలను తిలకించి తరించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# సోమశిల హైలెవల్ పనులకు గ్రీన్‌సిగ్నల్

**- ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు**

సోమశిల హైలెవల్ కాలువ రెండోవిడత పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంగీకారం తెలిపారని ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు తెలిపారు. ఈ పనులకు సుమారు 692 కోట్ల రూపాయలు ఖర్చవుతుందన్నారు. ఉదయగిరి ఆర్టీసి బస్‌డిపోలో పామూరు-సీతారామపురం మీదుగా బెంగుళూరుకు నూతన బస్సు సర్వీసుకు ఆయన ప్రారంభోత్సవం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లినేని మాట్లాడుతూ, నాయుడుపేటలో నిర్వహించిన నవనిర్మాణ దీక్ష ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రిని కలసి సోమశిల హైలెవల్ కాలువ విషయం తెలియజేశామన్నారు. ముఖ్యమంత్రి అందుకు సమ్మతిస్తూ, ఆ పనులు చేపట్టేందుకు అంగీకారం తెలిపారన్నారు. ఈ కాలువ ద్వారా ఉదయగిరి, వింజమూరు, దుత్తలూరు, కలిగిరి, సీతారామపురం మండలాల్లోని సుమారు 56 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు.

సోమశిలలో తగినంత నీరు లేకపోయినా, ఈ హైలెవల్ కెనాల్ పనులు పూర్తయితే పట్టిసీమ ద్వారా సాగునీరు మన మండలాలకు అందుబాటులోకి వస్తుందన్నారు. కావలి కాలువను ఆధునీకరించి జలదంకి మండలంలో 1.16 లక్షల ఎకరాలకు, సోమశిల ఉత్తర కాలువ ఆధునీకరణతో 27వేల ఎకరాలకు సాగునీరు అందించామన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం కుప్పం తరహాలో స్మార్ట్ వాటర్‌స్కీం మంజూరైందన్నారు. నీటిసమస్య శాశ్వత పరిష్కారానికి ఇంటింటికి కుళాయి ద్వారా నీటిసరఫరాకు 420 కోట్లు మంజూరయ్యాయన్నారు. పార్టీ మండల కన్వీనర్ డి.వెంకటస్వామి, జిల్లా మైనార్టీ నాయకుడు షేక్ రియాజ్, ఏఎంసి మాజీ వైస్‌ఛైర్మన్ బి. నరసింహులు, జిల్లా పార్టీ కార్యవర్గసభ్యుడు కె. మోహన్‌చౌదరి, కలిగిరి ఎంపిపి వెంకటేశ్వర్లు, ఎస్సీసెల్ నాయకుడు ఎన్.రాజా, నాయకులు ఓబుల్‌రెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు రెడ్డి, మండల ఆర్యవైశ్య అధ్యక్షుడు వెంకటసుబ్బారాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు సందాని, ఆలీజాన్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతే అవయవదాత!



భారతదేశంలో అతిపెద్ద వివిపి రైతు. ప్రభుత్వం ఆ విధమైన ప్రోటోకాల్ కల్పిస్తే, ముందుగా రైతుకే ఇవ్వాలి. ఈ సమాజంలో రాజు నుండి పారిశుద్ధ్య కార్మికుడి వరకు కడుపు నింపే తిండి గింజలను పండించేది రైతే! అలాంటి అన్నదాతలు అప్పుడప్పుడు ప్రాణదాతలు కూడా అవుతుంటారు. త్యాగాలకు ప్రతిరూపాలవుతుంటారు. ఇలాంటి రైతు కథే ఇది.

ఈ నెల 11వ తేదీన మర్రిపాడు మండలం నందవరం గ్రామానికి చెందిన ఎక్కలూరి రామయ్య(65) ఆత్మకూరుకు ఎరువుల కోసం ఆటోలో వెళుతూ తూలిపోయి రోడ్డు మీద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యాడు. వెంటనే అతనిని ఆత్మకూరు ఏరియా ఆసుపత్రికి, ఆ తర్వాత నెల్లూరు పెద్దాసుపత్రికి, అక్కడ నుండి సింహపురి ఆసుపత్రికి తరలించి చూపించారు. చివరిగా నారాయణ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. వైద్యులు పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించిన అనంతరం అతను ఇక కోలుకోడని చెప్పారు. దీంతో రామయ్య కుటుంబసభ్యులు అవయవ దానానికి ముందుకొచ్చారు.

13వ తేదీ నారాయణ ఆసుపత్రిలో వైద్యులు రామయ్య దేహంలోని కిడ్నీలను తీసి నారాయణ ఆసుపత్రిలోని ఒక బాధితుడికి, అలాగే కిమ్స్ ఆసుపత్రిలో మరో బాధితుడికి అమర్చారు. లివర్‌ను విజయవాడలోని మణిపాల్ ఆసుపత్రిలో వున్న పేషంట్‌కు అమర్చడానికి తరలించారు. అలా రామయ్య ముగ్గురు పాలిట శ్రీరాముడే అయ్యాడు.

# వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు సంక్షేమం

**- జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే పేదలు, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి, సంక్షేమం సాధ్యమవుతాయని జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అన్నారు. వెంకటగిరిలో ఈ నెల 10న తనను కలసిన వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల పార్టీ కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్సీపి అధినేత జగన్మోహన్‌రెడ్డి పోరాటాల ఫలితగానే రాష్ట్రానికి ప్రత్యేకహోదా అంశంపై ఉద్యమం తీవ్రంగా సాగుతోందన్నారు. ప్రత్యేకహోదా సాధన కోసం వైఎస్సార్సీపి ఎంపీలు రాజీనామాలు చేశారని అంటూ, టిడిపి మాత్రం దీక్షలంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ఎన్నికలు దగ్గరకు వస్తున్న సమయంలో టిడిపి తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కేంద్రం తమను మోసం చేసిందంటూ రాజకీయం చేస్తోందని ఆయన విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు వైఎస్సార్సీపిని గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీకి విజయం చేకూర్చాలని అన్నారు. వైఎస్సార్సీపి ప్రభుత్వం వస్తే అమలుచేయనున్న నవరత్నాల పథకాలను ప్రజలకు వివరించి పార్టీని బలోపేతం చేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు.

# చెన్నై గ్లోబల్‌లో అరుదైన లివర్ శస్త్ర చికిత్స


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డా॥ రజనీకాంత్

చెన్నై గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అరుదైన లివర్ శస్త్ర చికిత్సను నిర్వహించారు. ఈ మేరకు నెల్లూరులోని గ్లోబల్ ఆసుపత్రిలో ఈ నెల 13న విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రముఖ లివర్ వ్యాధి నిపుణులు డాక్టర్ పి.వి.రజనీకాంత్ మాట్లాడుతూ నెల్లూరుజిల్లా రాపూరుకు చెందిన కోడూరి పుల్లయ్య(45) అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చాడని, అతనికి లివర్ కింద కేన్సర్ గడ్డ ఉన్నట్లు నిర్ధారించి, దీన్ని తీసివేయాలంటే లివర్‌లో కొంత భాగాన్ని తొలగించాల్సి రావడంతో కుటుంబసభ్యుల అనుమతి మేరకు శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించామన్నారు. దాదాపు 2.9 కేజీల కాలేయ క్యాన్సర్ గడ్డను తొలగించడంతో ఇన్నాళ్ళు కడుపునొప్పితో విపరీతంగా బాధపడుతున్న పుల్లయ్య ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నాడని తెలిపారు. మితిమీరిన మద్యపానం, అధిక కొవ్వు, హెపటైటిస్, వైరస్, అధిక బరువు, షుగర్ లివర్ కేన్సర్‌కు కారణాలన్నారు. ఊరగాయలు, నిల్వ ఉంచిన వేరుశనగపప్పు లివర్‌ను దెబ్బతీస్తాయన్నారు. ఈ సమావేశంలో శస్త్ర చికిత్స చేయించుకున్న కోడూరి పుల్లయ్య పాల్గొన్నారు.

# డ్వామా పి.డిగా సూర్జిత్‌సింగ్

నెల్లూరుజిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పి.డిగా తొలిసారిగా ఎక్సైజ్ శాఖకు చెందిన అధికారిని ప్రభుత్వం నియమించింది. రాజమహేంద్రవరంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎన్.సూర్జిత్‌సింగ్ ఏడాదిపాటు డిప్యూటేషన్‌పై డ్వామా పి.డిగా రానున్నారు. ఆయన రాజమహేంద్రవరంలో మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటేషన్‌పై పి.డిగా వస్తున్న సూర్జిత్ సింగ్ కార్యాలయంలో పలు మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలిసింది.

# సూక్ష్మచిత్రంతో శుభాకాంక్షలు



నెల్లూరు జెండావీధికి చెందిన స్వర్ణకారుడు డా॥ షేక్ ముసవ్వీర్ ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ వెండితో సూక్ష్మ నమూనాను తయారు చేశారు. 1.800మి.గ్రా వెండితో తయారు చేసినట్లు డా॥ షేక్ ముసవ్వీర్ తెలియజేశారు.

# కనకమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

**- వైఎస్సార్సీపి మహిళా విభాగం**

తొలి తెలుగు స్వాతంత్ర్య సమరయోధురాలు పొణకా కనకమ్మ కాంస్య విగ్రహాన్ని నెల్లూరునగరంలో ఏర్పాటుచేయాలని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరి కోరారు. పొణకా కనకమ్మ జయంతిని పురస్కరించుకుని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో ఈ నెల 10న ఆ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలుగు మహిళగా కనకమ్మ స్వాతంత్ర్యసమరంలో పాల్గొని మహిళల ధీరత్వాన్ని నిరూపించారన్నారు. మహిళలు రాజకీయంగా ఎదగాలని తీర్మానించి మహిళా లోకానికే పొణకా కనకమ్మ ఆదర్శంగా నిలిచారన్నారు. కనకమ్మ కాంస్య విగ్రహాన్ని నెల్లూరులో ఏర్పాటు చేయాలని, ఆమె జీవితచరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు. గత నాలుగేళ్ళుగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పొణకా కనకమ్మ విగ్రహాన్ని నగరంలో నెలకొల్పాలని అనేకసార్లు ప్రభుత్వాన్ని కోరివున్నారన్నారు. తొలుత నాయకులందరూ కనకమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, సింహపురి ఐక్యవేదిక కో-కన్వీనర్ వసుంధరాదేవి, పార్టీ నగర మహిళాధ్యక్షురాలు తోట శోభారాణి, నాయకులు తిప్పిరెడ్డి మమత, భారతి, జమున, రమాదేవి, సుధీర్‌రెడ్డి, మొయిళ్ళ సురేష్‌రెడ్డి, కిరణ్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

### నెల్లూరు రాధయ్య దాతృత్వంతో...

# కాళయకాగొల్లుకి కళొచ్చింది

*జూన్ 10వ తేదీ నెల్లూరుజిల్లాలో ఓ అరుదైన రోజుగా నిలిచిపోతుంది. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని కాళయకాగొల్లు గ్రామంలో 100 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరించబడి జిల్లా చరిత్రలో ఇది ఓ చిరస్మరణీయ సంఘటనగా మిగిలిపోయింది.*








ప్రియా సిమెంట్ రాధయ్యగా అందరూ పిలుచుకునే నెల్లూరు రాధాకృష్ణారెడ్డి తనకు జన్మనిచ్చిన ఊరిని ఊపిరి పోసిన అమ్మా నాన్నలను స్మరించుకుంటూ అత్యాధునిక విద్యా వైద్యాలయాలను ఈ మారుమూల గ్రామంలో నిర్మించి ప్రారంభించాడు.

జూన్ 10వ తేదీ సాయంత్రం కాళయకాగొల్లు గ్రామ ప్రజలంతా ముస్తాబయ్యారు. తమ ఊర్లో "ప్రజ్ఞ్యప్రియ ఫౌండేషన్" ఆధ్వర్యంలో నెల్లూరు రాధాకృష్ణారెడ్డి, ఆయన శ్రీమతి ఇందిరమ్మ, కుమారులు జగన్‌మోహన్‌రెడ్డి, సుజిత్‌రెడ్డి చేపట్టిన మహత్కార్యం ప్రారంభోత్సవానికి హాజరుకావడానికి, ఆ ఆనందక్షణాలను వీక్షించడానికి గ్రామం మొత్తం తరలి వచ్చింది.

తాను పుట్టిన ఊరికి ఊరి జనానికి తన వంతు సేవ చేయాలనే తపనతో 5 యకరాల విస్తీర్ణంలో నెల్లూరు లక్ష్మీ దేవమ్మ ఉచిత ఆసుపత్రిని, నెల్లూరు చంద్రారెడ్డి హైస్కూల్, ఇంగ్లీషు మీడియం & డిజిటల్ క్లాసెస్ ప్రాంగణాలను అత్యంత ఆధునికంగా అందంగా తీర్చిదిద్ది రెండింటినీ ఒకేసారి ప్రారంభించారు.

రాధాకృష్ణారెడ్డి ఏ పని చేసినా ప్రత్యేకతను చాటుకుంటాడు. మనం చేసే పనిలో అంకితభావం, చిత్తశుద్ధి, నాణ్యత వుంటే విజయం తప్పక లభిస్తుందని భావించే తత్వం ఆయనది. తన స్వగ్రామంలో చేపట్టిన సేవా కార్యక్రమాలలో సైతం ఆయన ఎక్కడా రాజీపడలేదు. ప్రతి అంగుళంలోనూ కొత్తదనాన్ని ఆధునీకతని కనపరచాడు. రెండు ప్రాంగణాలనూ కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దాడు.

10వ తేదీ సాయంత్రం జరిగిన ప్రారంభోత్సవ వేడుకలో సైతం వైవిధ్యాన్ని చూపించాడు. సరిగ్గా 6 గంటల 5 నిముషాలకు వంద అడుగుల ఎత్తులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరింపజేసి భవనాల ప్రారంభోత్సవం జరిపించాడు. ఎలాంటి అతిథుల ప్రసంగాలు లేకుండా తన చిన్న కుమారుడు సుజిత్‌రెడ్డి ప్రారంభోపన్యాసంతో చెప్పాల్సిందంతా చెప్పించేసి "ఆరభి" సాంస్కృతిక సంస్థ నిర్వాహకులు అశోక్‌గురజాలి ఆధ్వర్యంలో సుమారు 100మందికి పైగా కళాకారులను రప్పించి వీనులవిందైన సుమధుర సంగీతాన్ని వినిపింపజేశారు.

తన గ్రామ ప్రజలే అతిథులుగా తమ ఊరి పిల్లలే అతిరథులుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి అందరి ప్రశంసలూ అందుకున్న రాధాకృష్ణారెడ్డికి వారి కుటుంబసభ్యులకు 'లాయర్' అభినందనలు.







## టీడీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్

రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీన నెల్లూరు, కస్తూరిదేవి గార్డెన్స్‌లో మేయర్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీమంత్రి పరసా రత్నం, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మన్ చాట్ల నరసింహారావు, టి.అనూరాధ, ఆనం జయకుమార్‌రెడ్డి, ఇతర మైనార్టీ నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.



సోమిరెడ్డిని సత్కరిస్తున్న ముస్లిం పెద్దలు

## 'ప్రభా'తం

- ఉత్తరకొరియా భద్రతకు కట్టుబడతానన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- కొరియన్ ద్వీపకల్పంలో పూర్తి అణునిరాయుధీకరణకు కట్టుబడతాన్న ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఉన్
- అమెరికా-ఉత్తరకొరియాల మధ్య సరికొత్తగా సంబంధాల స్థాపనకు కొరియన్ ద్వీపకల్పంలో శాంతి నెలకొల్పేందుకు ఇరుదేశాధీశుల అంగీకారం.
- అణునిరాయుధీకరణకు అంగీకరిస్తూ ఉమ్మడి ప్రకటనపై రెండు దేశాల అధినేతల సంతకాలు
- ఇదీ సింగపూర్ భేటీ ప్రత్యేకత.

# శుభ పరిణామం



**అమెరికా.. ఉత్తరకొరియా అధినేతల సింగపూర్ భేటీ చరిత్రాత్మకం. ఒకవిధంగా ఇదొక అద్భుతమనే చెప్పాలి. కొరియా ద్వీపకల్పంలో సుస్థిరమైన శాంతిని స్థాపించడానికి కలిసి పనిచేస్తామని, గతాన్ని పక్కన పెట్టి ముందుకు అడుగేద్దామని నిర్ణయించుకోవడం, అణు నిరాయుధీకరణకు కట్టుబడడం ద్వారా ఇరుదేశాల అధినేతల భేటీ ప్రపంచాన్ని ఆకట్టుకుంది. ప్రపంచాన్ని అణుమారణహోమాన్నుంచి తప్పించేందుకు మంచి నిర్ణయాలు తీసుకోవడం శుభపరిణామం.**

ప్రపంచమంతా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కీలకఘట్టం రానే వచ్చింది. అమెరికా-ఉత్తరకొరియాల సింగపూర్ భేటీ ఎవరూ ఊహించని విధంగా అద్భుతాల్నే సృష్టించింది. ఇరుదేశాలు శాంతి సామరస్యాల సాధనకు కట్టుబడుతూ ఒప్పందం చేసుకోవడం, కొరియా ద్వీపకల్పంలో సుస్థిరశాంతికి కలిసి కృషి చేయాలనుకోవడం, అణు నిరాయుధీకరణకు అంగీకరించడం వంటి నిర్ణయాలతో ఈ భేటీ ప్రపంచాన్ని ఆనందపరిచింది. యావత్ ప్రపంచం కోరుకుంటున్న విధంగానే ఇక్కడ శాంతి సామరస్యాలకు భరోసా లభించినట్లయింది.

కనీవినీ ఎరుగని విధంగా, మొట్టమొదటిసారిగా ఇటీవల సింగపూర్‌లో జరిగిన అమెరికా-ఉత్తర కొరియా దేశాల అధినేతల శిఖరాగ్ర సదస్సు ఎంతో చరిత్రాత్మకమైనది. అత్యంత ప్రాధాన్యమైనది కూడా. ఇది కొత్త భవితకు ద్వారాలు తెరుస్తుందనే ఆశాభావం అందరిలో చిగురించింది. తాము చేసిన ఉమ్మడి ప్రకటనలోని అంశాలను వేగవంతంగా అమలు చేయడానికి ట్రంప్, కిమ్ కట్టుబడడం అందరూ ఆహ్వానించదగిన పరిణామం కూడా.

ఇటీవలి దాకా విద్వేషాలతో.. ఘర్షణపూరిత ధోరణి రగులుతున్న నేపథ్యంలో ఇరుదేశాల అధినేతల మధ్య తాజాగా సరికొత్త మైత్రీభావంతో జరిగిన ఈ భేటీ ప్రపంచదృష్టిని బాగా ఆకట్టుకుంది. అన్నిరకాల వివాదాలకు స్వస్తి చెప్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్‌ల సింగపూర్ భేటీ ప్రశాంతవాతావరణంలో ఫలప్రదం కావడం ఎంతైనా మంచి పరిణామం. ఈ భేటీ జరగడమే ఒక పెద్ద విశేషం కాగా, అది ఎంతో సజావుగా జరిగి, ఆ రెండు దేశాల మధ్య జరిగిన చర్చలు సఫలీకృతం కావడం మరింత విశేషమే.

ముఖ్యంగా, దక్షిణ కొరియాతో కలిసి చేస్తున్న సంయుక్త సైనిక విన్యాసాలకు స్వస్తి పలికేందుకు ట్రంప్ అంగీకరించడం... తాము గతాన్ని విడిచిపెట్టాలని నిర్ణయించుకున్నామని, ప్రపంచం ఒక పెనుమార్పును చూడబోతోందని కిమ్ ప్రకటించడం.. ఒక అద్భుతం. తమ ఈ మైత్రి ద్వారా కొరియన్ ద్వీపకల్పంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ శాంతి, సుస్థిరతకు దోహదపడుతుందని, పరస్పర విశ్వాసం, పాదుకొల్పే చర్యల వల్ల కొరియన్ ద్వీపకల్పంలో అణు నిరాయుధీకరణకు ఊతమిస్తుందని విశ్వసిస్తూ ఆ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ జె. ట్రంప్, ఉత్తర కొరియా నాయకుడు కిమ్‌జోన్ ఉన్‌లు చేసిన సంయుక్త ప్రకటనతో దశాబ్దాల తరబడిగా ఆయా దేశాల మధ్య సాగుతున్న ఉద్రిక్తతలకు, వైషమ్యాలకు అడ్డుకట్ట వేసినట్లే. ఇక..శాంతికి ముందడుగు పడినట్లేనని అనుకోవచ్చు. మరీ ముఖ్యంగా కొరియా ద్వీపకల్పంలో సుస్థిరమైన శాంతిని స్థాపించడానికి కలిసి పనిచేస్తామని అమెరికా, ఉత్తర కొరియా అధినేతలు ఇద్దరూ ఒక ఒప్పందానికి రావడం ప్రపంచమంతా అభినందించే విషయం.

అంతేకాదు, గతాన్ని పక్కనపెట్టి ముందుకు అడుగేద్దామని ఇద్దరు అధినేతలూ సంకల్పించడం అందరికీ మహదానందకరం. అందులోనూ, ప్రపంచాన్ని అణు మారణహోమాన్నుంచి తప్పించేందుకు దోహదం చేసే నిర్ణయాలు తీసుకోవడం ప్రపంచానికంతటికీ ఎనలేని సంతోషం కలిగించే విషయం. ఉద్రిక్తతలను పెంచే యుద్ధవిన్యాసాలకు అమెరికా చరమగీతం పాడనుండడం, ఉభయదేశాల ప్రజల శాంతి సౌభాగ్యాలను ఆకాంక్షిస్తూ కొరియా ద్వీపకల్పంలో సుస్థిర శాంతికి, అణు నిరాయుధీకరణకు కట్టుబడడం ద్వారా ఈ భేటీ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నట్లయింది. దీంతో, ఎట్టకేలకు కథ సుఖాంతమైంది.

ఏదేమైనా, విశ్వశాంతి శుభోదయమే.. మానవాళికి మహోదయం. ప్రపంచం శాంతిగా ఉంటేనే సకల మానవాళి అంతా సుఖసంతోషాలతో వర్ధిల్లుతుంది. యుద్ధమేఘాలు ఎక్కడ ఆవరించినా ప్రపంచశాంతికి విఘాతం కలుగుతుంది. విద్వేషాలు మాని స్నేహసౌహార్ద్రభావాలతో, శాంతి సామరస్యాల పరిరక్షణే ధ్యేయంగా కృషిచేయడమే మానవాళికి ఆనంద దాయకమైన విషయం. అయితే, అణ్వాయుధాలు ఇంకా మరికొన్ని దేశాల వద్ద కూడా ఉన్నాయి. అలాంటి దేశాలన్నీ కూడా విశ్వశాంతిని కాంక్షిస్తూ సకల మానవాళి శ్రేయస్సును కోరుకుంటూ సంపూర్ణ అణు నిరాయుధీకరణకు ముందుకు రావాలని ప్రపంచమంతా కోరుకుంటోంది. అప్పుడే విశ్వశాంతికి పూర్తి స్థాయిలో భరోసా ఉంటుంది. ఆ దిశగా అన్నిదేశాలు అడుగు ముందుకు వేసిననాడే విశ్వశాంతికి అసలైన శుభోదయం..మానవాళికి మహోదయం. ఆ రోజు త్వరితంగా రావాలని.. వస్తుందని... అందరం మనసారా కోరుకుందాం!....

# అనిల్‌డ్యానీకి పెరసం రాష్ట్రస్థాయి పురస్కారం



పురస్కారాన్నందుకుంటున్న బూతపాటి అనిల్‌డ్యాని

పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలోని జూనియర్ రేబాల లక్ష్మి నరసారెడ్డి స్మారక భవనంలో నిర్వహించిన పెన్నా వార్షిక వేడుకల్లో విజయవాడకు చెందిన బూతపాటి అనిల్‌డ్యానికి పెన్నా సాహిత్య పురస్కారాన్ని అందజేశారు. ఆయన రచించిన కవితా సంపుటి "ఎవిమిదో రంగు"కు పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా హైదరాబాద్‌కు చెందిన కవులు డాక్టర్ ప్రసాదమూర్తి, జి.లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెరసం కార్యవర్గ సభ్యులు రచించిన "పెన్నా కథలు", నల్లు రమేష్ రచించిన "రమణీయ రత్నావళి" పుస్తకాలను ముఖ్యఅతిథులు ఆవిష్కరించారు. పెరసం అధ్యక్షులు అవ్వారు శ్రీధరబాబు, ప్రధాన కార్యదర్శి గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, ప్రముఖ రచయిత్రి డాక్టర్ సోమిరెడ్డి జయప్రద, వ్యవస్థాపకఅధ్యక్షులు మోపూరు పెంచలనరశింహం, తోట సులోచన, గోవిందరాజుల సుభద్రాదేవి తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

# ఆదిత్య కళాశాలలో సాహితీ సభ



ప్రొ॥ ఎం.జె.ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఆచార్య ఆదిత్య, తదితరులు

నెల్లూరులోని ఆదిత్య కళాశాల సెమినార్‌హాల్‌లో ఈ నెల 10న పొట్లూరు సాహిత్య వేదిక, తెలుగు భాషోద్యమ సమితి సంయుక్త ఆధ్వర్యంలో సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రవాస భారతీయుడు, సింగపూర్ హైకోర్టు ఇంటర్‌ప్రిటర్(తెలుగు, తమిళ అనువాదకుడు), ప్రొఫెసర్ ఎం.జె.ప్రసాద్, విశిష్ట అతిథిగా రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎన్.లక్ష్మీ అయ్యర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పొట్లూరు సాహిత్య వేదిక అధ్యక్షులు పొట్లూరు సుబ్రహ్మణ్యం, తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య ఆదిత్య అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శానంపూడి కృష్ణయ్య, సోంపల్లి ఆనందరావు, ఎన్.దశరథరామిరెడ్డి, కోటిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.




# వివాదాల్లోకి లాగొద్దు

రాజకీయ అవసరాల కోసం తిరుమల తిరుపతి దేవస్థానాన్ని వివాదాలలోకి లాగడం పద్ధతి కాదు. రాజకీయ పార్టీలు హిందువులను చేతగానివాళ్ళుగా భావిస్తున్నాయి. హిందువుల మనోభావాలతో మాత్రమే చెలగాటమాడుతున్నాయి. హిందూ సంస్కృతి అంటే మీడియాకు చులకనైపోయింది. టీవీలలో చర్చావేదికలు పెట్టి అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. హిందువులలో చైతన్యం వచ్చి ఏకం కాకపోతే హిందూ సంస్కృతిని వీళ్ళు నాశనం చేస్తారు.

**సి. రాజీవి, నెల్లూరు.**

# దారితప్పుతున్న న్యాయం

వైద్యవృత్తి తర్వాత న్యాయవాద వృత్తికి అత్యంత ప్రాధాన్యత వుంది. గతంలో న్యాయవాదులు ధనాపేక్ష లేకుండా నిజాయితీగా కేసులను వాదించి తమ కక్షిదారులకు న్యాయం అందించేవాళ్ళు. అలాంటి న్యాయవాదులు నేడు దుర్భర జీవితం గడుపుతున్నారు. కాని, ఇప్పుడు న్యాయవాదులు చాలా మంది డబ్బే లోకంగా పనిచేస్తున్నారు. తమ క్లయింట్లకు తెలియకుండా అవతల క్లయింట్లతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకుని వాయిదాలకు హాజరుకాకుండా కేసులను నీరుగారుస్తున్నారు. తీర్పు సమయంలో అసలు కోర్టులకే హాజరుకావడం లేదు. న్యాయమూర్తులు కూడా కేసులను సంవత్సరాల తరబడి వాయిదాలు వేస్తూ తమ వృత్తికి న్యాయం చేయలేకున్నారని, కొందరు న్యాయవాదులు, న్యాయమూర్తుల మధ్య రహస్య ఒప్పందాలుంటున్నాయనే విమర్శలూ లేక పోలేదు. కోర్టు ప్రొసీడింగ్స్‌ను మొత్తం కంప్యూటరైజ్ చేస్తే కొంతన్నా కక్షిదారులకు మేలు జరగొచ్చు.

**బాధితుడు, నెల్లూరు.**

# నాలుగేళ్లు... నీతికి నీళ్ళు

చంద్రబాబు నాలుగేళ్ళ పాలన చూస్తే అవినీతి, అక్రమాలు, అడ్డగోలు దోపిడీ తప్పితే ఇంకేమీ లేదు. అభివృద్ధి మాటల్లో తప్పితే ఆచరణలో లేదు. అమరావతి రాజధాని అన్నది పెద్ద డ్రామా! నాలుగేళ్ళలో అమరావతిలో ఏం జరిగింది. సింగపూర్ టెక్నాలజీ సాయంతో వేలకోట్లు ఖర్చు పెట్టి వర్షం వస్తే నీళ్ళు కారే భవనాలను కట్టారు. పోలవరం ప్రాజెక్ట్‌పై కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ దృష్టి పెట్టబట్టి సరిపోయింది గాని లేకుంటే ఆ ప్రాజెక్ట్ కాంక్రీట్ పనులు కూడా నిలబడిపోయి వుండేవి. పరిపాలనలో అవినీతి పెరిగింది. ఏ పని కావాలన్నా లంచం ఇవ్వనిదే జరగడం లేదు. ముఖ్యంగా వ్యాపారాలు దెబ్బతిన్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నాలుగేళ్ళ పాలన అత్యంత చెత్తగా వుందని చెప్పవచ్చు.

**– సి.వి.మాల్యాద్రి, నెల్లూరు.**

## అనుబంధాలు, ఆత్మీయతలు, అనురాగాల అపురూప

# సంగమం

స్నేహమేరా జీవితం...



- చిన్ననాటి స్నేహితుల కుటుంబాలతో రెండురోజుల పాటు ఆనందంగా గడిపిన ఉపరాష్ట్రపతి వెంకయ్య కుటుంబసభ్యులు
- నెల్లూరు వంటకాల రుచినే కాదు, వెంకయ్య స్నేహమాధుర్యాన్ని కూడా ఆస్వాదించిన మిత్రులు



**పదవి పెరిగితే బంధం విడిపోవాలా...? హోదా పెరిగితే స్నేహితులకు దూరం కావాలా? అధికార వలయంలో వుంటే అనుబంధాల నిలయాన్ని వదులుకోవాలా? మనసుకు దగ్గరగా వున్న మనుషులతో మనసు విప్పి మాట్లాడుకోలేమా? ఈ ప్రశ్నలన్నింటికీ ఒకే ఒక్క సమాధానం ముప్పవరపు వెంకయ్యనాయుడు.**

అవును ఈ ప్రశ్నలన్నింటికీ ఆయన ఒకే ఒక చర్యతో సమాధానం చెప్పాడు. స్నేహానికి పదవులు, హోదాలు అడ్డురావని తేల్చేసాడు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ద్వితీయ పౌరుడిగా వుండి... స్నేహితులు తనను అందుకోలేనంత ఎత్తులో వున్నా కూడా ఆయనే వారికి అందేలా దిగివచ్చాడు. తన బాల్యం నుండి విద్యార్థి దశను మొదలుకొని రాజకీయ జీవితంలో, రాజ్యాంగ జీవితంలో ఈ క్షణం వరకు తనకు తోడుగా నిలిచి, తనకు నీడగా నడచి, తన జీవితాన్ని ఇంత ఉన్నతంగా మలచిన ఎందరో ఆప్తులను, స్నేహితులను, ఆత్మీయులను ఉపరాష్ట్రపతి భవన్‌కే పిలిచారు. స్నేహితుల కోసం ఉపరాష్ట్రపతి భవన్ ద్వారాలను తెరచి వారిని స్వాగతించారు. ఈ నెల 2, 3తేదీలలో 'సంగమం' అంటూ 'స్నేహమేరా జీవితం' అన్న ట్యాగ్‌లైన్‌తో రెండురోజుల పాటు ఉపరాష్ట్రపతి భవన్‌లో తన మిత్రులను కుటుంబసభ్యులను కలుసుకున్నారు. వారితో ఆయన గత స్మృతులను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపితే, ఆయన పిలుపుతో పులకించి అక్కడికి విచ్చేసిన ఆయన మిత్రబృందం వెంకయ్య, ఉషమ్మ దంపతుల ఆప్యాయతకు ఆతిథ్యానికి పరవశించిపోయారు. అచ్చ తెలుగు పంచెకట్టుతో తెలుగు పదాల పడికట్టుతో వెంకయ్య వారిలో ఒకడిగా కలిసిపోయి వారిని ఉపరాష్ట్రపతి భవన్ అంతా తిప్పుతూ అక్కడి విశేషాలు చూపిస్తూ ఆ సమయంలో దేశానికి రెండో పౌరుడిలా కాకుండా వారి చిన్ననాటి మిత్రుడిలా వ్యవహరించారు. అంతేనా, చిన్ననాటి జ్ఞాపకాలను మరోమారు గుర్తుకు తెచ్చుకునేలా అక్కడే బయోస్కోప్ సినిమా, బొమ్మల డబ్బా, పీచుమిఠాయి, కలర్‌సోడా, గాజుల అంగడి, దోశలు, పులిబొంగరాలు, రేగిపళ్ళు, తాటిముంజలు వంటివి ఏర్పాటు చేసారు. వెంకయ్య మనుమరాలు సుష్మ బయోస్కోప్, మెహందీ, ఫుట్‌మసాజ్, పుల్లఐస్, ఐస్ గోలా, ఫైర్‌పాన్, లైవ్‌సాంగ్స్ ఏర్పాటు చేసింది. తమ ఆహ్వానాన్ని అందుకుని తమ కోసం విచ్చేసిన స్నేహితులు, ఆప్తులు, ఆత్మీయులను వెంకయ్య, ఆయన సతీమణి ఉషమ్మ, కుమార్తె దీపావెంకట్‌లు పేరుపేరునా పలుకరించి వారితో ఎంతో సంతోషంగా గడిపారు. వెంకయ్య ఆతిథ్యం కంటే ఆయన తమను గుర్తు పెట్టుకుని ఉపరాష్ట్రపతి భవన్‌కు పిలిచి చూపించిన ప్రేమకు ఆయన స్నేహితులు చలించిపోయారు. మాటలతో చెప్పలేని భావోద్వేగానికి లోనయ్యారు. గత 15ఏళ్ళలో నాన్నగారిలో ఇంతటి సంతోషాన్ని ఎప్పుడూ చూడలేదని దీపా వ్యాఖ్యానించడం గమనార్హం. ఎదిగినా ఒదిగేతత్వం, తన జీవిత పయనంలో పరిచయమైన ప్రతి వ్యక్తినీ గుర్తుంచుకునే మనస్తత్వం, ఏదో ఒక సందర్భంలో వారితో కలిసి మంచి చెడ్డలు మాట్లాడుకునే వ్యక్తిత్వం వెంకయ్యది. 1978లో ఉదయగిరి ఎమ్మెల్యేగా వున్నప్పటి నుండి ఏడాది క్రితం కేంద్రమంత్రిగా పని చేసినంతవరకు ఆయన తన స్నేహితులతో కలవడానికి, సరదాగా, సంతోషంగా గడపడానికి ఏ పదవీ అడ్డురాలేదు. కాని, ఏడాది క్రితం ఆయన ఉపరాష్ట్రపతి అయ్యారు. ఆయన చుట్టూ ఒక రక్షణ వలయం ఏర్పడింది. దూరంగా స్నేహితులు... పోలీసుల మధ్య ఆయన. స్నేహితులను కలవాలి, వారితో మాట్లాడాలి అని మనసు పీకుతున్నా... ఆ మనసును కట్టిపడేస్తున్న విధి నిర్వహణ... అందుకే స్నేహితులనే ఆయన తన ఇంటికి పిలిపించుకున్నాడు. "ఆనాటి ఆ స్నేహమానంద గీతం... ఆ జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం... ఈనాడు ఆ హాయి లేదేల నేస్తం... ఆ రోజులు మునుముందిక రావేమిరా... లేదురా ఆ సుఖం, రాదురా ఆ గతం, ఏమిటో జీవితం..." అంటూ పాడుకున్నారు.

*ఈ ఆత్మీయ సంగమంకు విచ్చేసిన ప్రతి ఒక్కరినీ వెంకయ్య పేరు పేరునా పలుకరించారు. వారి వ్యక్తిగత సమస్యలను అడిగి మరీ తెలుసుకున్నారు. వారి వ్యాపారాలు, వృత్తులు యోగక్షేమాల గురించి మాట్లాడారు. 50, 60ఏళ్ళ క్రితం స్నేహితులను కూడా గుర్తు పెట్టుకుని వారి జీవితాలలో జరిగిన సంఘటనలను జ్ఞప్తికి తెచ్చుకున్నారు.*





*ఈ ఆత్మీయ సంగమానికి చెన్నై, హైదరాబాద్, కాకినాడ, విశాఖ, విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, నెల్లూరు నగరాల నుండి దాదాపు వంద కుటుంబాలు, 30మంది మిత్రులు హాజరయ్యారు. వెంకయ్యనాయుడు విఆర్ కళాశాల మిత్రులతో, సంఘ్‌లో పనిచేసిన నాటి సన్నిహితులతో ఎక్కువుగా మమేకమై ముచ్చట్లు పెట్టుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు.*









# బ్రదర్స్ దారెటు?

ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డి... ఆనం వంశంలో మొదటి తరం. ఆనం సంజీవరెడ్డి, ఆనం భక్తవత్సలరెడ్డి, ఆనం వివేకా, ఆనం రామనారాయణ రెడ్డి, ఆనం జయ, ఆనం విజయ... వీళ్ళంతా రెండోతరం నాయకులు... ఇప్పుడు మూడోతరం కూడా రంగంలో వుంది. ఆనం వెంకటరమణారెడ్డి, ఆనం చెంచుసుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, ఆనం కార్తికేయరెడ్డి. 2009 ఎన్నికల తర్వాత ఆనం వెంకటరమణారెడ్డి మాయమయ్యాడు. స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి కొడుకులైన ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డిలు 2014 ఎన్నికల ద్వారా ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఏ.సి.సుబ్బారెడ్డి ఆ ఎన్నికల్లో నెల్లూరు నగరం అసెంబ్లీ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోగా, ఆనం రంగమయూర్‌రెడ్డి మాత్రం 12వ డివిజన్ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగానే కార్పొరేటర్‌గా గెలిచాడు.

ఈరోజు వివేకా లేడు, ఆయన రాజకీయ వారసులు సుబ్బారెడ్డి, మయూర్‌రెడ్డిలే! వారి చిన్నాన్న ఆనం రామనారాయణరెడ్డి వైసిపిలో చేరడానికి రంగం సిద్ధమవుతోంది. వీళ్ళను కలుపుకునే ఆయన పార్టీలో చేరాలనే ఆలోచనలో వున్నాడు. వైసిపిలో చేరితే ఆయనకు ఎక్కడోచోట అసెంబ్లీ సీటొస్తుంది. రామనారాయణరెడ్డి తన కోసమే కాకుండా మరో అసెంబ్లీ సీటును కాని లేదా కార్పొరేషన్‌ను గాని తమకివ్వాలని కోరినట్లు తెలిసింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో వైసిపిలో కండీషన్‌లు పెట్టి చేరే సీన్ లేదు. పార్టీలో చేరాక మన శక్తిసామర్థ్యాలు చాటుకుని పార్టీలో ఎదగాల్సిందే! ఇప్పుడు వైసిపిలో చేరితే రామనారాయణరెడ్డికి సీటివ్వగలరేగాని ఏసి, మయూర్‌లకు ఏమిస్తారన్నది గ్యారంటీ వుండదు. అయితే వారిద్దరికి ఇంకా భవిష్యత్ వుంది కాబట్టి పార్టీలో చేరి తమ చిన్నాన్న నాయకత్వంలో ఎదిగేదానికి అవకాశముంది.

కాగా, తెలుగుదేశం వైపు నుండి వివేకా కొడుకులిద్దరినీ పార్టీలో నిలబెట్టుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే ఏ.సి.సుబ్బారెడ్డికి నెల్లూరు టిక్కెట్ లేదా కార్పొరేషన్ ఆఫర్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మయూర్‌రెడ్డి మాత్రం తన చిన్నాన్నతో కలిసి వైకాపాలో చేరడానికే సిద్ధంగా వున్నాడని, ఏ.సి.సుబ్బారెడ్డి విషయంలో మాత్రం ఇంకా క్లారిటీ రాలేదని తెలుస్తోంది.



# గుర్తుకొస్తున్నాయి...!

ఇన్నాళ్ళూ వ్యాపార సేవా రంగాలకే పరిమితమై ఇప్పుడు రాజకీయ రంగంలో కూడా అడుగు పెట్టిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఒక్కసారిగా తన పాత జ్ఞాపకాలలోకి వెళ్ళిపోయాడు. ఇటీవల చంద్రగిరి ఎమ్మెల్య చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతికి సమీపంలోని తుమ్మలగుంటలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఆయన అతిథిగా విచ్చేసి తాను చదువుకునే రోజుల్లో క్రికెట్ ఛాంపియన్‌గా సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నాడు. టోర్నమెంట్ తిలకించడంతో పాటు కొంతసేపు క్రికెట్ ఆడి, టోర్నమెంట్‌లో బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్‌లతో పాటు ఆల్‌రౌండర్‌గా ఎంపికయ్యేవారికి ఒక్కొక్కరికి 50వేల రూపాయలు విపిఆర్ ఫౌండేషన్ పక్షాన అందిస్తానని నజరానాలు ప్రకటించాడు. ఈ టోర్నీలో మొత్తం 378జట్లు పాల్గొన్నాయి. 6113 మంది క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్న ఈ టోర్నీకి అథితిగా ఒకప్పటి రంజీ క్రికెటర్, ఆట విలువ తెలిసిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని చెవిరెడ్డి పిలవడం క్రికెట్ ఆటకు ఇచ్చిన గౌరవంగా చెప్పుకోవచ్చు.



# మేం కట్టే ఇళ్ళు అద్భుతం

## - మంత్రి నారాయణ



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి పి.నారాయణ, పక్కన మేయర్ అజీజ్, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి

రాష్ట్రంలోని 110 మున్సిపాల్టీలలో 7.34లక్షల ఇళ్ళను పేదలకు కట్టించి ఇవ్వాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని, మేం ఎంతో అద్భుతంగా ఇళ్ళు నిర్మిస్తుంటే, ప్రతిపక్షాలు పనీపాట లేకుండా ఆరోపణలు చేస్తున్నాయని రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యుత్తమ షేర్‌వాల్ టెక్నాలజీతో ఇళ్ళు కడుతున్నాం. బయట రాష్ట్రాల ప్రజాప్రతినిధులు వచ్చి ఈ ఇళ్ళను చూసి పొగిడి వెళుతున్నారు. ఇళ్ళ నిర్మాణంలో నాణ్యతపై ఎక్కడా రాజీ పడలేదు. రోజురోజుకూ గృహ నిర్మాణ వస్తువుల ధరలు పెరుగుతున్నా నాణ్యతకు లోటు రానీయడం లేదు. కాంగ్రెస్ హయాంలో పేదల ఇళ్ళను ఎంత అవతారంగా కట్టారో చూసాం. వై.యస్.ఆర్ నగర్‌లో కట్టిన 6,400 ఇళ్ళు తంతే కూలిపోయే స్థితిలో వున్నాయని మంత్రి ఎద్దేవా చేసారు. ప్రత్యేకహోదాపై బీజేపీ, వైసిపి, జనసేనలు దొంగాట ఆడుతున్నాయని, ప్రజలే వాటికి బుద్ధి చెబుతారని మంత్రి హెచ్చరించారు.

ఈ సమావేశంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మేయర్ అబ్దుల్ అజీజ్, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# స్టాండింగ్ డ్రామా ముగిసింది

నెల్లూరు కార్పొరేషన్ స్టాండింగ్ కమిటి ఎన్నికలు ఈ నెల 9న కార్పొరేషన్ కార్యాలయంలో జరిగాయి. మొత్తం 5స్టాండింగ్ కమిటీ సభ్యుల పదవులకు 6మంది పోటీలో నిలిచారు. ఈ ఎన్నికల్లో ఎలాగూ గెలిచేది లేదని చెప్పి వైకాపా సభ్యులు ఎన్నికలను బహిష్కరించారు. తెలుగుదేశం నాయకత్వం ఈసారి నూనె మల్లిఖార్జున యాదవ్, పిట్టి సత్యనాగేశ్వరరావు, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, షేక్ సల్మా, ప్రశాంత్ కుమార్‌లను స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని నిర్ణయించింది.

అయితే మేయర్ అజీజ్ ఈ ఐదుగురిలో ఒకరి మీదున్న వ్యతిరేకతతో తన అనుచరుడు ప్రశాంత్‌కిరణ్‌తో కూడా నామినేషన్ వేయించాడు. దీంతో ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి వచ్చింది. అతని చేత నామినేషన్ విత్‌డ్రా చేయించడానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర గట్టి ప్రయత్నం చేసాడు. నామినేషన్ ఉపసంహరణ గడువు ముగిసిపోవడంతో 9వ తేదీ ఎన్నికలు అనివార్యమయ్యాయి. దీంతో పార్టీ జిల్లా నాయకత్వం నుండి రెబల్‌గా పోటీలో వున్న ప్రశాంత్‌కిరణ్‌కు ఓటు వేయొద్దని టీడీపీ కార్పొరేటర్లకు ఫోన్‌లు వెళ్ళాయి. ఎన్నికల రోజున పోటీలో వున్న ప్రశాంత్‌కిరణ్ కూడా తనకు ఓట్లు వేయొద్దని, పార్టీలోని లోపాలను ఎత్తి చూపడానికే రెబల్‌గా పోటీ చేసానంటూ తన ఓటును కూడా తనకు వేసుకోలేదు. దీంతో మిగతా ఐదుగురు నూనె మల్లిఖార్జునయాదవ్ 35 ఓట్లతో, పిట్టి సత్యనాగేశ్వరరావు 34 ఓట్లతో, ప్రశాంతకుమార్ 34 ఓట్లతో, షేక్ సల్మా 34 ఓట్లతో, ఉచ్చి భువనేశ్వరప్రసాద్ 33 ఓట్లతో స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

# నెల్లూరు కబుర్లు

## మోగిన బడిగంట



వేసవి సెలవులు ముగిసాయి. ఎండలు కూడా కొంచెం తగ్గుముఖం పట్టాయి. ఒకటిన్నర నెలకుపైగా సెలవుల్లో సరదాగా గడిపిన విద్యార్థులు బడిబాట పట్టారు. ఇళ్ళల్లో తల్లిదండ్రులకు హడావిడి మొదలైంది. సెలవుల్లో పిల్లల పని లేకపోవడంతో ఒక గంట ఆలస్యంగా లేయడం అలవాటు చేసుకున్న తల్లులకు మళ్ళీ తెల్లారుజామునే లేచి పిల్లల్ని రెడీ చేసే రోజులొచ్చాయి. జిల్లాలో దాదాపు నాలుగున్నర వేల పాఠశాలల్లో క్లాసులు మొదలయ్యాయి. రోడ్ల మీద స్కూల్ బస్సుల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

## కన్యకా పరమేశ్వరి గుడిలో పూజలు




విలేకర్లతో మాట్లాడుతున్న ముక్కాల ద్వారకానాథ్, దాసా సురేష్‌రాజా

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో పునర్నిర్మాణంలో వున్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఈ నెల 17న వాసవి కోటి నామార్చన జరుగుతుందని ఆలయ పాలక మండలి ఛైర్మెన్ దాసా సురేష్‌రాజా తెలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన జరిగి ఈ నెల 16వ తేదీకి ఏడాది ముగుస్తున్న సందర్భంగా 17వ తేదీ ఉదయం 11.30గంటలకు 2వేల మంది దంపతులతో వాసవి కోటినామార్చన చేసి, పూజ చేసిన ఇటుకలను అమ్మవారి పాదాల ముందుంచుతామని మంగళవారం దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చెప్పారు. నగర డిప్యూటీ మేయర్, అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ కమిటి ఛైర్మెన్ దాసా సురేష్‌రాజా, కమిటీ సభ్యులు ఎంతో నిష్టతో, పట్టుదలతో ఆలయ పనులను వేగవంతంగా చేస్తున్నారని అభినందించారు. ఇప్పటివరకు రెండు రాజగోపురాలు, ఐదు ఉప ఆలయాలు, గర్భగుడి చుట్టూ వరండా, అంతరాలయానికి బేస్‌మట్టం పనులు పూర్తయినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు పబ్బిశెట్టి శ్రీనివాసులు, చలువాది వెంకటశరత్‌కుమార్, సుంకు మనోహర్, డి.వివేకానందం, సరాబు సుబ్రహ్మణ్యం, కోట సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కనకమ్మ చరిత్ర.. భావితరాలకు ఆదర్శం

## - రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



స్వాతంత్ర్య సమరయోధురాలిగా, గాంధీజీకి శిష్యురాలిగా నిలిచిన పొణకా కనకమ్మ చరిత్ర నేటితరానికి ఆదర్శమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ ఆశ్రమంలో ఈ నెల 10న పొణకా కనకమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జెకె రెడ్డితో కలిసి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పొణకా కనకమ్మ విగ్రహానికి, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోటంరెడ్డి మాట్లాడుతూ, ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించిన ధీరవనిత పొణకా కనకమ్మ అని, సొంత డబ్బుతో ఆమె జిల్లాలో గ్రంథాలయాలను ఏర్పాటు చేశారని, ఆ రోజుల్లోనే పేదలకు తమ భూములను పంచి ఇచ్చిన దానశీలి అని కొనియాడారు. మద్యం తాగొద్దంటూ కల్లు కుండలను పగులగొట్టి జైలుజీవితం గడిపిన సామాజిక ఉద్యమనాయకురాలు కనకమ్మ అని ప్రశంసించారు. మహాత్మాగాంధీ మాటల్లో చెప్పాలంటే, నెల్లూరంటే ఒకటి పెన్నానది.. రెండు పొణకా కనకమ్మ అని అన్నారన్నారు. అంతటి ధీరవనిత గురించి తాను ఎన్నికలయ్యాక పుస్తకం రాస్తానన్నారు. నెల్లూరు నగరంలో పొణకా కనకమ్మ స్థాపించిన కస్తూరిదేవి విద్యాలయం కార్పొరేట్ల పాలుకాకుండా అందరి సహకారంతో అడ్డుకున్నామన్నారు. కస్తూరిదేవి విద్యాలయంలో కనకమ్మ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని ఆమె కుటుంబసభ్యులు కోరారని, పెద్దలు ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో తానే ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సింహపురి మహిళా ఐక్యవేదిక అధ్యక్షురాలు డాక్టర్ వసుధ, ఆశ్రమ కమిటీ కన్వీనర్ గణేశం కృష్ణారెడ్డి, రెడ్‌క్రాస్ ఛైర్మెన్ ఏ.వి.సుబ్రహ్మణ్యం, డాక్టర్ సుచరిత, కమిటీ సభ్యులు రొంపిచర్ల శివరామయ్య, గూడూరు లక్ష్మి, తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, కాళిదాసు పురుషోత్తం, దయాకర్‌రెడ్డి, ఆశ్రమ మేనేజర్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్‌ల పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న పొన్నాల రామచంద్రారెడ్డి

నెల్లూరు కార్పొరేషన్ 38వ డివిజన్‌లోని పొట్టేపాలెంలో ఈ నెల 8వ తేదీ నవనిర్మాణదీక్ష ముగింపు కార్యక్రమం జరిగింది. స్థానిక తెలుగుదేశం నాయకులు, కోదండ రామస్వామి దేవస్థానం ఛైర్మెన్ పొన్నాల రామచంద్రారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని నవనిర్మాణ దీక్ష ప్రతిజ్ఞను నిర్వహించారు. ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా 27మందికి కొత్తగా మంజూరైన పింఛన్‌లను ఆయన అందజేశారు.

# రెవెన్యూలో భారీ కదలిక

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం భారీఎత్తున జరిపిన బదిలీలలో నెల్లూరుజిల్లాలో పనిచేస్తున్న కొందరు ఉన్నతాధికారుల కుర్చీలు కూడా కదిలాయి. జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న వెంకటసుబ్బయ్యను ప్రకాశం జిల్లా రెవెన్యూ అధికారిగా బదిలీ చేశారు. కడప జిల్లా ప్రత్యేక కలెక్టర్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావును నెల్లూరు డిఆర్‌ఓగా నియమించారు. తెలుగుగంగ ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ పి.ప్రశాంతిని అనంతపురం పట్టణాభివృద్ధి సంస్థ వైస్‌ఛైర్మెన్‌గా బదిలీ చేసారు. ఆమె భర్త, నుడా వైస్‌ఛైర్మెన్ ఢిల్లీరావును ఇటీవలే అనంతపురం జేసీగా బదిలీ చేయడం తెలిసిందే! ఐటిడిఏ పి.ఓ కమలకుమారిని జేసీ-2గా నియమించారు. గూడూరు ఆర్డీఓ అరుణ్‌బాబును తూర్పుగోదావరి జిల్లా జేసీ-2గా బదిలీ చేసారు. నాయుడుపేట ఆర్డీఓ శీనానాయక్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేసారు. సివిల్ సప్లయిస్ ఇన్‌ఛార్జ్ డి.ఎం రోజ్‌మాండ్‌ను డిఆర్‌డిఏ పి.డిగా నియమించారు. వెయిటింగ్‌లో వున్న ఎం.శ్రీదేవిని నాయుడుపేట ఆర్డీఓగా నియమించారు.

## చాందీని కలిసిన నెల్లూరు నేతలు

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ ఊమెన్‌చాందీని 12వ తేదీ విజయవాడలో నెల్లూరుకు చెందిన కాంగ్రెస్ నాయకులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, పనబాక కృష్ణయ్య, పి.చెంచలబాబుయాదవ్ కలుసుకున్నారు. ఊమెన్ చాందీని శాలువాతో సత్కరించి రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీని బలోపేతం చేసే మార్గాలపై వారు ఆయనతో చర్చించారు.

# మీ ఛార్జిషీట్ సంగతి చూసుకోండి!

- జగన్‌పై బీద సెటైర్



ఛార్జిషీట్లకు బ్రాండ్ అంబాసిడర్ అయిన ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి తెలుగుదేశం ప్రభుత్వ నాలుగేళ్ళ పాలనపై ఛార్జిషీట్ విడుదల చేయడం కామెడీగా వుందని తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు. 9వ తేదీ నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు జీరో మార్కులు వేసానని జగన్ అంటున్నాడని, ప్రభుత్వానికి జగన్ మార్కులు అవసరం లేదని, చంద్రబాబు పాలనకు ప్రజలు నూరు మార్కులేసారని అన్నారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఏపిలో 50లక్షల మందికి పింఛన్‌లు ఇచ్చారు. కష్టాల్లో వున్న రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించారు. బీజేపీ, వైసిపిలు ఏకమై అడ్డంకులు సృష్టిస్తున్నా మొక్కవోని దీక్షతో అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్ట్‌లను ముందుకు తీసుకెళుతున్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతున్న చంద్రబాబును రాజకీయంగా ఎదుర్కోలేకే అడ్డగోలు విమర్శలు చేస్తున్నారంటూ జగన్‌పై బీద ధ్వజమెత్తారు. 8వ తేదీ నాయుడుపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొని నవ నిర్మాణదీక్ష ముగింపు సభకు తండోపతండాలుగా తరలివచ్చి సభను విజయవంతం చేసిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.అనూరాధ, పార్టీ కార్యాలయ సమన్వయ కార్యదర్శి బి.మనోహర్‌రెడ్డి, కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హర్షను పరామర్శించిన ఆనం



ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది, సూళ్ళూరుపేట మండలం కోటపోలూరులోని తన ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న చెంగాళమ్మ దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డిని 12వ తేదీన మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఇద్దరూ రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నారు.

# కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ స్కానర్




కంటైనర్ స్కానర్‌ను ప్రారంభిస్తున్న కృష్ణపట్నం పోర్టు సి.ఇ.ఓ అనిల్ ఎండ్లూరి, డా॥ జాన్‌జోసెఫ్

నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం కృష్ణపట్నం ఓడరేవులో అత్యాధునిక కంటైనర్ స్కానర్‌ను ఐఆర్‌ఎస్ అధికారి డాక్టర్ జాన్‌జోసెఫ్ ఈ నెల 9న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనతికాలంలోనే కృష్ణపట్నం కంటైనర్‌టెర్మినల్ అభివృద్ధి సాధించిందన్నారు. ఆధునిక వసతులు కలిగిన రేవులో అల్ట్రాసౌండ్ తనిఖీలతో ఎగుమతులు, దిగుమతులు పూర్తి స్థాయి భద్రతతో సత్వరమే జరుగుతాయన్నారు. పోర్టు సి.ఇ.ఓ అనిల్ ఎండ్లూరి మాట్లాడుతూ ఈ పద్ధతిలో గంటకు 100 వాహనాలను తనిఖీ చేసే వీలుందన్నారు. దీంతో వ్యాపారవేత్తలకు సమయంతో పాటు ఖర్చు తగ్గుతుందన్నారు. కస్టమ్స్ అనుమతులు త్వరితగతిన పూర్తై సరకులు గమ్యస్థానానికి చేరుతాయన్నారు. ఆధునిక వసతుల్లో భాగంగా కంటైనర్ల నిర్వహణకు ఆర్టీజీ క్రేన్లను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎస్టీ ముఖ్యకమిషనర్(వైజాగ్) షెరావత్, గుంటూరు కమిషనర్ శ్రీహరిరావు, కస్టమ్స్ కమిషనర్లు కోక సుధా, శేఖర్, ఆర్.రామ్మోహన్‌రావు, కెపిసిటి సివోవో జితేంద్ర, సివోవో సుబ్బారావు పాల్గొన్నారు.



# జిల్లాలో ముగిసిన సీఎం సంకల్పం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా చేపట్టిన నవనిర్మాణ దీక్ష ముగింపు సభ ఈ నెల 8వ తేదీ నాయుడుపేటలో ముగిసింది. ఈ కార్యక్రమాన్ని మొదట నెల్లూరులో నిర్వహించాలనుకున్నప్పటికీ, ఆరోజుకు నెల్లూరులో పిడుగులు పడే అవకాశం వుందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరించిన నేపథ్యంలో నాయుడుపేటకు మార్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రేణిగుంట ఎయిర్‌పోర్టు నుండి హెలికాప్టర్‌లో బయలుదేరి పెళ్ళకూరు మండలంలోని తాళ్వాయిపాడు గ్రామానికి రెండు గంటలు ఆలస్యంగా చేరుకున్నారు. అక్కడ పలు గృహాలను సందర్శించి వారి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామస్థులతో ముచ్చటించారు. తన పరిపాలన అద్భుతమని వాళ్ళు పొగుడుతుంటే విని ఆనందించారు.



గర్భిణీ స్త్రీలను ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఇక్కడ గ్రామదర్శిని కార్యక్రమం ముగిసిన అనంతరం నాయుడుపేటకు చేరుకున్నారు. ఏఎల్ సిఎం క్రీడామైదానంలో జరిగిన మహాసంకల్ప సభలో పాల్గొని నాలుగేళ్ళలో తాను చేసిన పనులను వివరించారు. అధికారంలోకి వచ్చాక 60రకాల సంక్షేమ పథకాలను అమలు చేసాం. సిజెఎస్‌ఎఫ్ భూములను ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేసాం, సోమశిల హైలెవల్ కెనాల్ పనులను 800కోట్లతో ప్రారంభించాం. త్వరలో నెల్లూరు, సంగం బ్యారేజీలను పూర్తి చేస్తాం. జిల్లాలో లక్షాపాతిక వేల ఎకరాలకు అదనంగా సాగునీళ్లిచ్చాం. పులికాట్ ముఖద్వారం పూడిక తీతకు 43కోట్లు కేటాయించాం. నాయుడుపేట వద్ద స్వర్ణముఖిపై బ్యారేజీ నిర్మిస్తామని, తాగునీటి సమస్య లేకుండా చేస్తామని, నాయుడుపేట, చిత్తూరు రహదారిని ఆరులైన్లుగా మార్చడానికి ప్రతిపాదనలు పంపామని సీఎం చెప్పుకొచ్చారు. పనిలోపనిగా తిరుపతి ఎంపి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు మీ అభివృద్ధిని పట్టించుకోవడం లేదంటూ ఎత్తిపొడిచారు. మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, పి.నారాయణ, నారా లోకేష్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, కలెక్టర్ ముత్యాలరాజు, ఆర్టీసీ ఛైర్మెన్ వర్ల రామయ్య, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీమంత్రి పరసారత్నం, మాజీఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, బల్లి దుర్గాప్రసాద్, జడ్పీ ఫ్లోర్‌లీడర్ వేనాటి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

ఉత్తరక్రియలు



మా తండ్రి గారైన
మేజర్ పాణకా శ్రీనివాసులురెడ్డి గారు
తేది. 7.6.2018 గురువారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
పాణకా దివ్యతేజారెడ్డి - కుమారుడు
పాణకా శివకుమార్‌రెడ్డి - అన్న
ఉత్తరక్రియలు : తేది.19.6.2018 మంగళవారం రాత్రికి శిలాప్రతిష్ఠ
తేది. 20.6.2018 బుధవారం ఉ॥ 9.30 గం.లకు ఎత్తురేవు, బ్రాహ్మణ బియ్యాలు(పెద్దకర్మ)
గూడూరు, తూర్పువీధిలోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

# మహ్మదీయన్ వెల్ఫేర్ సేవలు అభినందనీయం

## - ఎమ్మెల్యే సునీల్



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, షేక్ రియాజ్‌అహ్మద్ తదితరులు

మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ చేస్తున్న కార్యక్రమాలలో భాగస్వామి కావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని షాదీమంజిల్‌లో మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వ ర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని పేద ముస్లిం మహిళలకు చీరలు, పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలను, నగదు ప్రోత్సాహకాలను ఈ నెల 10వ తేదీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ పేదల పట్ల అంకితభావంతో ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నెట్‌వర్క్ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. తెలుగుదేశంపార్టీ ప్రభుత్వం ముస్లిం, మైనార్టీలకు పెద్దపీట వేస్తుందని తెలియజేశారు. నియోజకవర్గంలో ప్రతి ముస్లిం సోదరుడు ఇఫ్తార్ విందుకు రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నెట్‌వర్క్ గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్, అధ్యక్షుడు రహీమ్, రఫి, ఉదయ్ కుమార్, కౌన్సిలర్లు వాటంబేడు శివ కుమార్, షంషీర్ తదితరులు పాల్గొన్నారు.



## గూడూరు డివిజన్ వార్తలు



వివరాలను తెలియజేస్తున్న డిఎస్పీ రాంబాబు

# గంజాయి పట్టివేత

చిల్లకూరు మండలం కోట క్రాస్‌రోడ్డు వద్ద విశాఖపట్నం నుండి చెన్నై వెళుతున్న శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సులో గంజాయిని తీసుకొచ్చి ఆటోలో విద్యానగర్ ప్రాంతానికి తరలిస్తున్న ముగ్గురిని చిల్లకూరు పోలీసులు అరెస్ట్ చేశారని గూడూరు డివీఎస్పీ రాంబాబు ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో తెలిపారు. ఎనిమిదిన్నర కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సి.ఐ అక్కేశ్వరరావు, ఎస్సై శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్‌లను తనిఖీ చేసిన మయూరి శ్యాం



కొండాగుంట రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేస్తున్న శ్యాంసుందరరావు

గుంతకల్ డివిజన్ పరిధిలోగల కొండాగుంట, వెందోడు రైల్వే స్టేషన్లలో వున్న మౌలిక వసతుల గురించి ఇటీవల ప్రయాణీకులను అడిగి తెలుసుకున్నామని డిఆర్‌యుసిసి సభ్యుడు శ్యాంసుందరరావు అలియాస్ మయూరి శ్యాంయాదవ్ తెలిపారు. ప్రధానంగా కొండాగుంట రైల్వేస్టేషన్‌లో మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. ప్లాట్‌ఫాం 2లో షెల్టర్స్ ఏర్పాటు చేయకపోవడంతో ఎండలోనే చిన్నారులు, వృద్ధులు రైలు ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే విధంగా వెందోడు రైల్వేస్టేషన్‌నందు షెల్టర్, విశ్రాంతి గదిలో ఫ్యాన్లు లేక ప్రయాణీకులు ఉక్కపోతకు గురి అవుతున్నట్లు తెలిపారు. కొండాగుంట రైల్వేగేటు మీదుగా రైలు రాకపోకలు అధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుమారు 20గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు, కొండాగుంట గేటు వద్ద బాక్స్‌టైపు అండర్‌బ్రిడ్జిని నిర్మిస్తే ప్రజలకు ఇబ్బందులు ఉండవని అన్నారు.

ఈ నెల 19వ తేదీన గుంతకల్లు రైల్వే డివిజన్‌లో జరుగనున్న డిఆర్‌యుసిసి సమావేశంలో ప్రజల సమస్యలను పరిష్కరించేలా తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## ఆశ్రమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# దివ్యాంగులకు ట్రై సైకిళ్ళు



దివ్యాంగులకు ట్రైసైకిళ్ళు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీల్

గూడూరు పట్టణంలో ఆదివారం ఆశ్రమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రైసైకిళ్ళను గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో యువతకు కొదవలేదని, దేశాభివృద్ధి, రాష్ట్రాభివృద్ధిలో యువత ప్రాధాన్యం ఎంతగానో అవసరమని అన్నారు. పేదల కోసం యువత సేవాభావంతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ ద్వారా ప్రత్యేకంగా పేదవారి కోసం ఎక్కువ సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. ప్రతిఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు సాయిరాం, మనపాటి రవీంద్ర, వేగూరు రాజేంద్రప్రసాద్, పేటేటి చంద్రనీల్, ఇంద్రనీల్, నారాయణ, నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

# వృద్ధులకు సహకారం అద్భుతం

## - రూరల్ సి.ఐ అక్కేశ్వరరావు



వృద్ధులకు పండ్లు అందజేస్తున్న సి.ఐ అక్కేశ్వరరావు, లయన్స్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి తదితరులు

అందరూ ఉన్నా వృద్ధాప్యంలో ఆశ్రమంలో గడపడం ఎంతో బాధాకరమని, ప్రతిఒక్కరూ సమాజంలో పెద్దలను గౌరవంగా చూసుకోవాలని రూరల్ సి.ఐ అక్కేశ్వరరావు తెలిపారు. గూడూరు పట్టణంలోని సాయిరాం ఛారిటీస్ వృద్ధాశ్రమంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గదిని ఈ నెల 10వ తేదీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నెలబల్లి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించి, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సి.ఐ అక్కేశ్వరరావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని తెలిపారు. లయన్స్‌క్లబ్ వారు చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఎక్కడో ఒక చోట సేవా కార్యక్రమాన్ని చేస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కడివేటి చంద్రశేఖర్, జి.చంద్రశేఖర్, మురళీరెడ్డి, రామ్మోహన్, రమణయ్య, రూపేష్, రవిచంద్రారెడ్డి, ఎస్.కె.మస్తాన్, ఆశ్రమం ప్రతినిధి కల్యాణి తదితరులు ఉన్నారు.

## రోటరీ ఆధ్వర్యంలో

# ఫలసరుకుల పంపిణీ



వృద్ధులకు ఫలసరుకులు పంపిణీ చేస్తున్న అధ్యక్ష కార్యదర్శులు మునిరాజా, బాలకృష్ణరాజు తదితరులు

గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ రోటరీ భవన్‌లో గత 13సంవత్సరాలుగా నిర్వహిస్తున్న వృద్ధులకు ఫలసరుకుల పంపిణీ కార్యక్రమం చేపట్టామని రోటరీ అధ్యక్షుడు పసుపులేటి మునిరాజా, కార్యదర్శి బాలకృష్ణంరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అల్లూరి ఆదిశేషారెడ్డి కృషితో ఏర్పాటైన ఈ పథకం కింద 60మంది నిరాదరణకు గురైన వయోవృద్ధులకు జీవితాంతం నెలవారీ ఫలసరుకులు అందించడం అత్యంత సంతృప్తినిచ్చే కార్యక్రమమన్నారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్లు కె.మునిగిరీష్, మయూరిశ్యాంయాదవ్, పి.రఘురామిరెడ్డి, దశరథరామిరెడ్డి, దయాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పి.మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు చీరలు, పంచెలు



గిరిజనులకు చీరలు పంపిణీ చేస్తున్న గుండాల లక్ష్మీనరసయ్య ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

గుండాల లక్ష్మీ నరసయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల కాలం చేసిన గుండాల నరసయ్య స్మారకార్థం ఆయన కుమారుడు, ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు గుండాల నరేంద్రబాబు డమ్మాయిపాళెంలోని స్వగృహంలో దువ్వూరివారిపాళెం గ్రామంలోని 30మంది గిరిజనులకు చీరలు, పంచెలు ఈ నెల 12న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ గిరిజనులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలను కల్పించిందని, ప్రతిఒక్కరూ వారి పిల్లలను బడికి పంపించి చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండాల జయరామయ్య, బాలయ్య, శేషయ్య, గోపాలయ్య, కృపావతి, గుండాల రోహిత్‌కుమార్, శోభ, పద్మమ్మ, ఇందిరమ్మ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# నారా కుటుంబానికి నందమూరి శాపం

శ్రీను గల్పిక

## భేతాళకథ

పట్టువదలని హైటెక్ విక్రమార్కుడు ఎర్లీ మార్నింగ్ ఎయిట్‌ఫార్టీ ఫైవ్ కల్లా నిద్ర లేచాడు. ఒంట్లో కొవ్వు 250మిల్లీగ్రాములుందని, రోజూ వాకింగ్ చేయమని డాక్టర్ 2500 రూపాయలు తీసుకుని చెప్పివుండడంతో ఆరోజుకు తన కర్తవ్యంగా 250మీటర్ల వాకింగ్‌ను పూర్తి చేసాడు. రూమ్‌లో నీట్‌గా రెడీ అయ్యి నాలుగు మసాలా దోశ, ఐదు రవ్వదోశ, ఏడు ప్లేట్ల పూరీతో లైట్‌గా బ్రేక్‌ఫాస్ట్ కానిచ్చి మద్రాసుబస్టాండ్ వద్దకొచ్చి నిలబడ్డాడు. ఒక్క క్షణంలోనే పది ఆటోలు తన ముందు నిలవగా విక్రమార్కుడు ఒక ఆటోను సెలక్ట్ చేసుకుని ఎక్కాడు. విక్రమార్కుడు సీట్లో కూర్చున్నంతలోనే ఆటో పెద్దాసుపత్రి ముందు ఆగింది. విక్రమార్కుడు ఆటోవాలాతో... మీరు ఫార్ములా వన్‌కు వెళితే ఫస్ట్‌ప్రైజ్ తెచ్చుకుంటారు, ట్రై చేయకూడదూ అని వ్యంగ్యంగా అంటూ ఆటో దిగి పెద్దాసుపత్రిలోకి అడుగుపెట్టాడు. మార్చురీ లోపలకు వెళ్ళి స్మెల్‌రాని ఫ్రెష్ బాడీని భుజాన వేసుకుని బోడిగాడితోటలోని రోటరీ క్లబ్ శ్మశాన వాటిక వైపు నడవసాగాడు. కెవిఆర్ పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి విక్రమార్కుడికి చెమటలు పట్టాయి. ఓపిక నశించింది. అడుగులు నీరసంగా పడుతున్నాయి. గొంతు దాహంతో ఎండిపోతోంది. నీరసంగానే భేతాళ... భేతాళ అంటూ శవాన్ని తట్టాడు. అప్పుడు శవంలోని భేతాళుడు... రాజా, నీ బాడీ స్టామినా పరీక్షిద్దామని చెప్పే ఇంతవరకు పలకలేదు. నీకు వయసు మీద పడుతున్నట్లుంది. ఇక ఎక్కువకాలం నన్ను మోయలేవు... కాబట్టి టీటీడీలో రమణదీక్షితులు మాదిరిగా రిటైర్మెంట్ తీసుకుని కొత్తవారికి అవకాశమివ్వడం మంచిది అని సలహా ఇచ్చాడు. దానికి విక్రమార్కుడికి ఒళ్ళు మండి నా రిటైర్మెంట్ సంగతి నేను చూసుకుంటాను, ముందు నీ డ్యూటీ నువ్వు చెయ్... ఏదో సోది పురాణం చెబుతావు కదా, అది చెప్పి ఏడిస్తే నేను త్వరగా రూమ్‌కెళ్ళి పడుకుంటాను అని అడిగాడు. అప్పుడు భేతాళుడు... నీకు "ప్రపంచాన్ని చుట్టిన వీరుడు – తండ్రిని ముంచిన పుత్రుడు" అనే లేటెస్ట్ పొలిటికల్ స్టోరీ చెబుతాను విను అంటూ మొదలుపెట్టాడు.

హైటెక్‌రత్న నారా చంద్రబాబునాయుడు అనే పేరు తెలియని వాళ్ళు ఈ ప్రపంచంలోనే వుండరు. కంప్యూటర్‌ను కనిపెట్టింది ఆయనే! సెల్‌ఫోన్‌లను ప్రపంచానికి పరిచయం చేసింది ఆయనే! భారత దేశానికి నలుగురు ప్రధానులను అందించిన ఘననేత అతను. అంతేనా... బిల్‌క్లింటన్‌ను అమెరికా అధ్యక్షుడిని చేసింది, సత్య నాదెళ్ళను గూగుల్ సి.ఇ.ఓ చేసింది ఆయనే! బిల్‌గేట్స్‌కు ఆయనంటే పిచ్చి అభిమానం. ప్రపంచం మెచ్చిన నాయకుడాయన. ప్రపంచంలో 198దేశాలుంటే... కాదు 200 దేశాలున్నాయని కొత్త దేశాలు కనిపెట్టింది కూడా ఆయనే. మరి చంద్రబాబే ఇలా వుంటే ఆయన వారసుడు ఎలా వుండాలి అని భేతాళుడు విక్రమార్కుడిని ప్రశ్నించాడు. చంద్రబాబుకన్నా నాలుగాకులు ఎక్కువ చదివి వుండాలని విక్రమార్కుడు చెప్పాడు. కాని ఇక్కడ సీన్ అందుకు భిన్నంగా వుందంటూ భేతాళుడు వేళ్ళతో గాల్లోనే స్క్రీన్ గీసి సీన్స్ ప్లే చేసి ఈ అద్భుత సుభాషితాలు చూడు అని చెప్పాడు. స్క్రీన్ మీద సీన్‌లు... లోకేష్‌బాబు తెరపై ప్రత్యక్షం...

అన్నా... ఈ దేశంలో అత్యంత కులపిచ్చి, మత పిచ్చి, అవినీతి పిచ్చి వున్న పార్టీ ఏదన్నా వుందంటే అది తెలుగుదేశమే. అవునంటారా? కాదంటారా?... అవును అవును అంటూ సభలోంచి ప్రజల నినాదాలు.

అన్నా మీ అందరికీ ఒకటే చెబుతున్నా, వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసారంటే మీ మెడకు మీరు ఉరి వేసుకున్నట్లే.

అది అంబేద్కర్ జయంతి వేడుక... లోకేష్ మైక్ తీసుకుని... అంబేద్కర్ మనందరికీ మార్గదర్శకుడు... ఆయన వర్ధంతి సందర్భంగా మీ అందరికీ శుభాకాంక్షలు తెలుపుకుంటున్నాను.

40ఏళ్ళ రాజకీయ జీవితంలో మచ్చలేని వ్యక్తి చంద్రబాబు... ఆయన ప్రతిష్టను అంతం చేయడానికి మనమంతా కంకణం కట్టుకోవాలి.

మహానాడు వేదికపై లోకేష్ స్పీచ్... పంచాయితీ వార్డు మెంబర్లుగా కూడా గెలవలేనివాళ్ళను ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదే!

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా రాకపోతే ఈ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పట్టినగతే టీడీపీకి పడుతుంది.

ఇక్కడితో లోకేష్ సుభాషితాల సీన్‌లు ముగిసాయి. స్క్రీన్ క్లోజ్ చేసి భేతాళుడు రాజా, చూసావు కదా... లోకేష్ ఆణిముత్యాలలో ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే! నీకు ఓపిక వుండి చూస్తే ఇంకా చాలా వున్నాయి. నీకు సబ్జెక్ట్ అర్థం కావడానికి మాత్రమే ఇవి చూపించాను. సైకిల్ గుర్తుకు ఓటేస్తే మన తాడుతో మనం ఉరేసుకున్నట్లే అని ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి కూడా ఏ మీటింగ్‌లో చెప్పలేదు. అలాంటిది భవిష్యత్‌లో చంద్రబాబు తర్వాత తెలుగుదేశంకు నాయకత్వం వహించాల్సిన లోకేష్‌బాబే ఆ పార్టీ గురించి చెడుగా ఎందుకు మాట్లాడుతున్నట్లు? చంద్రబాబు ప్రతిష్టను నాశనం చేయడానికి ఎందుకు కంకణం కట్టుకున్నట్లు? ఈ ప్రశ్నకు సమాధానం తెలిసి కూడా చెప్పకపోయావో ఈ రాష్ట్రంలో ఒక ప్రభుత్వ ఆఫీసర్‌గా మారి చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్‌ల దెబ్బకు మెంటలొచ్చి రోడ్డున పడతావని బెదిరించాడు.

అందుకు విక్రమార్కుడు... భేతాళ... 1995లో ఏం జరిగిందో నీకు తెలిసేవుంటుంది. ఎన్టీఆర్ కొడుకులను అడ్డంపెట్టుకునే చంద్రబాబు ఆయనను పదవీచ్యుతుడిని చేసాడు. ఆ మానసిక వేదనతో ఎన్టీఆర్ రగిలిపోయాడు. నా కొడుకుల చేతనే నన్ను ముఖ్యమంత్రి పీఠం నుండి దింపేస్తావా... భవిష్యత్‌లో నీ కొడుకే నీ పార్టీకి శత్రువవుతాడు... నీ పార్టీని ఓడించాలని ప్రజలకు పిలుపునిస్తాడు... నీ పరువు ప్రతిష్టలకు కళంకం తెస్తానని కంకణం కట్టుకుంటాడు అని శపించాడు. ఆ శాపం ఫలితమే ఈ లోకేష్ ఆణిముత్యాలు అని చెప్పాడు. విక్రమార్కుడి సమాధానంతో సంతృప్తి చెందిన భేతాళుడు బాడీలోంచి లేచి తుర్రుమన్నాడు.

---

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

స్థిరాస్తుల మీద, షేర్ల మీద ఆదాయం ఉంటుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. వ్యవహారాలలో వ్యతిరేకత పోతుంది. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు, పనిభారం ఉంటుంది. పనులు నిదానంగా అనుకూలంగా సాగుతాయి. ఆరోగ్యం బాగుంటుంది. ఖర్చులు ఎక్కువైనా వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం బాగుంటుంది.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ప్రతిభా పాటవాలు, గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగులకు పని భారం, అధికారుల సహకారం బాగుంటుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. వ్యాపకాలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి బాగుండి, వ్యాపారాలలో వృద్ధి, ఆదాయం బాగుంటుంది. వృత్తిపరంగా పెరుగుదల, తీరిక లేకపోవడం ఉంటుంది.

### మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఉద్యోగులకు పనిభారం, స్థాన మార్పులుండవచ్చును. అనుకోని ఖర్చులు కొన్ని పైనబడగలవు. బంధువులతో విభేదాలు, చికాకులుంటాయి. బిడ్డల విద్యా ఉద్యోగ విషయాలలో శుభవార్తలు వింటారు. ఆరోగ్యం జాగ్రత్త. అనుకున్న పనులు ధైర్యంగా నిర్వహించుతారు. వృత్తి వ్యాపారాలలో సామాన్యవృద్ధి, రాబడి ఉంటుంది. మీ సలహాలు, సూచనలు ఇతరులు ఆమోదిస్తారు.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

దైవక్షేత్ర సందర్శన, విదేశీ ప్రయాణాలకు అనుమతులు దొరుకుతాయి. అనుకున్న పనులు ప్రశాంతంగా నిర్వహిస్తారు. ఆరోగ్యం స్వల్పంగా ఇబ్బంది పెట్టవచ్చును. పెట్టుబడులకు అవకాశాలుంటాయి. వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఆదాయం పెరుగుతుంది. వృత్తిపరంగా అవకాశాలు బాగుంటాయి. అయితే కుటుంబ ఖర్చులు పెరుగుతాయి.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

సన్నిహితుల వల్ల సమస్యలు రావచ్చును. స్థిరాస్తులపై పెట్టుబడులపై ఆదాయముంటుంది. కొత్త కాంట్రాక్టులు, నిర్మాణాలు లభించి ముందుకు సాగుతారు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉన్నత విద్యావకాశాలు బాగుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. స్వల్ప విషయాలపై బంధువర్గంతో విభేదాలు రావచ్చును.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కొత్త విషయాలు తెలుసుకొంటారు. కుటుంబ సౌఖ్యం, మీ ఆరోగ్యం బాగుంటుంది. దూరప్రయాణాలుంటాయి. సభలు సమావేశాలలో పాల్గొంటారు. ఆరోగ్యం బాగుంటుంది. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగానే ఉంటాయి. పెట్టుబడులకు అవకాశాలుంటాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి – మీ వాసి

తేది. 15.6.2018 నుండి
తేది. 21.6.2018 వరకు

ఈ వారము మిధున కర్కాటక సింహ కన్యా రాశులలో చంద్రుడు, మిధునంలో రవిబుధులు, కర్కాటకంలో శుక్రరాహువులు, తులలో గురువు, ధనుస్సులో శని, మకరంలో కుజ కేతువులు సంచరిస్తారు.

**పంచాంగము :**
తేది 21 గురువారం ఉదయం గంట 10.0 నుండి 12.0 లోగా సింహ లగ్నమున వివాహ, వ్యాపారములు.

జ్యేష్ఠ మాసములో గృహారంభము చేసిన యజమానికి మృత్యుప్రదము

**నిజ జ్యేష్ఠ మాస శుక్లపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 15 | శుక్ర | విదియ | రా॥ గం.9.22వ॥ |
| తేది. 16 | శని | తదియ | రా॥ గం.7.00వ॥ |
| తేది. 17 | ఆది | చతుర్థి | సా॥ గం.4.27వ॥ |
| తేది. 18 | సోమ | పంచమి | ప॥ గం.2.05వ॥ |
| తేది. 19 | మంగళ | షష్ఠి | ప॥ గం.11.52వ॥ |
| తేది. 20 | బుధ | సప్తమి | ఉ॥ గం.9.53వ॥ |
| తేది. 21 | గురు | అష్టమి | ఉ॥ గం.8.13వ॥ |

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కొత్త పరిచయాలు, దూర ప్రయాణాలుండవచ్చును. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత కలదు. కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. ప్రభుత్వ అనుమతులు లభించడం, వస్తు వాహన రిపేర్లుండగలవు. ఆర్థికంగా బలపడే ప్రయత్నాలలో అనుకూలత కలదు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతుంటాయి. ఆదాయానికి తగ్గ ఖర్చులుంటాయి.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనుకోని ఖర్చులు పైనబడగలవు. బంధుమిత్రుల సహకారంతో ఒక సమస్య నుండి బయటపడతారు. సభలు, సమావేశాలలో పాల్గొనడం, కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. శుభకార్య ప్రయత్నాలు చేస్తారు. పనులందు టెన్షన్ ఉంటుంది. అనవసర వ్యవహారాలలో తలదూర్చవద్దు. ఉద్యోగులు బాధ్యతలందు నిర్లక్ష్యము చూపవద్దు. పనులు నిదానంగా జరుగుతాయి.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత తక్కువ. ఉద్యోగ సౌఖ్యం, అధికార వర్గ సహకారం బాగుంటుంది. ఉద్యోగార్థులకు అవకాశాలు ఉన్నాయి. అనుకోని దూర ప్రయాణాలుంటాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. మాటలలోను, చేతలలోను తొందరపాటు ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో వనరులు, ఆదాయం బాగుండినా ఖర్చుల భారం పెరుగుతుంది.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

అనుకున్న పనులను లౌక్యంగా జరుపుకొనాలి. అధికారులకు ఉద్యోగులకు పనిభారం, వత్తిడి పెరుగుతుంది. ఆరోగ్య విషయాలలో జాగ్రత్త అవసరం. ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. స్థిరాస్తుల లావాదేవీలు, పెట్టుబడుల ప్రయత్నాలు వాయిదా వేసికొనడం మంచిది. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థిక వ్యవహారాలు నడిపేటప్పుడు జాగ్రత్త అవసరం. దూరప్రయాణాలుంటాయి. ఉద్యోగవర్గాలకు పని భారం, శ్రమ ఉంటుంది. ఆరోగ్యపరంగా ఇబ్బంది పడతారు. వివాదాలు పరిష్కారానికి రావచ్చును. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. స్థిరాస్తులపై రాబడి, షేర్ల మీద లాభాలుంటాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరుకుతాయి. ఆదాయ విషయంలో అసంతృప్తి ఉంటుంది.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

బిడ్డలకు ఉన్నత విద్యావకాశాలు దొరకడం, శుభకార్య నిర్ణయాలు జరగడం ఉంటుంది. ఉద్యోగులకు పనులు సాఫీగా జరగడం, మీ సలహాలు ఆమోదం పొందడం జరుగుతుంది. ఆరోగ్యం బాగుంటుంది. బంధుమిత్రులను కలుసుకొంటారు. కొత్త ఆర్థిక ప్రయత్నాలందు అనుకూలత, వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. అనుకున్న పనులు నెరవేరుతాయి.

# రైతులకు పెద్దన్న జక్కా వెంకన్న

## - సంతాపసభలో అన్ని పార్టీల నేతలు




సంతాప సభలో ప్రసంగిస్తున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ఈ నెల 12వ తేదీన నెల్లూరు పినాకిని నగర్‌లోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి స్మారక భవనంలో స్వర్గీయ జక్కా వెంకయ్య సంతాప సభ జరిగింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే సి.వి.శేషారెడ్డి, సీపీఐ నాయకులు పి.దశరథరామయ్య, సిపిఎం నాయకులు చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటేశ్వర్లు, రైతు నాయకులు కోటిరెడ్డి, పెన్నా సుధాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జక్కా శేషమ్మ, జక్కా అశోక్‌బాబు, జక్కా వెంకయ్య పెద్ద కుమార్తె శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు. జక్కా వెంకయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలందరు కూడా జక్కా వెంకయ్యతో తమకున్న అనుబంధాన్ని, ఆయన స్ఫూర్తితో తమ జీవితాలను మలచుకున్న విధానాన్ని వివరించారు. జక్కా వెంకయ్య రైతు పక్షపాతి, జిల్లాలో సాగునీటి సమస్యలపై పూర్తి అవగాహన వున్న నాయకుడు. ప్రజాప్రతినిధులే కాదు, జిల్లా ఉన్నతాధికారులు కూడా సాగునీటి పంపిణీ విషయంలో ఆయన సలహాలను గౌరవించేవారు. ఆయనొక ఉద్యమసూరీడు. నెల్లూరుజిల్లాలో ఆయన పాత్ర లేకుండా జరిగిన ఉద్యమమే లేదు. మన మధ్య ఆయన లేకున్నా ఆయన ఉద్యమ స్ఫూర్తి మన మనసుల్లో వుంటుందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పెన్నా బ్యారేజీకి జక్కా వెంకయ్య పేరు పెట్టాలంటూ రైతు నాయకుడు కోటిరెడ్డి చేసిన విజ్ఞప్తికి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు.



ప్రజాదీవెనలో భాగంగా మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

# బాబు వచ్చాక.. జాబులు పోయాయి

## - నగర ఎమ్మెల్యే అనిల్

వైఎస్సార్‌సిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఉద్యోగాల భర్తీ జరుగుతుందని నెల్లూరు నగర ఎమ్మెల్యే డా. అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఈనెల 13న స్థానిక 8వ డివిజన్‌లోని ముకుందాపురం ప్రాంతంలో ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 2014లో ఎన్నికలప్పుడు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగభృతి కింద 2వేల రూపాయలు ఇస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, అయితే టిడిపి అధికారంలోకి వచ్చినా నేటికీ ఒక్కరికైనా ఉద్యోగం ఇచ్చిన దాఖలాలు లేవని అంటూ, ఏ అర్హత లేని తమ కుమారునికి మాత్రం ఐ.టి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉద్యోగం ఇచ్చుకున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు లక్షా 40వేల ఉద్యోగాలు భర్తీ చేయకుండా నాలుగేళ్ల నుంచి కాలయాపన చేస్తూ, నిరుద్యోగులను మోసం చేస్తున్నారంటూ ఆయన ముఖ్యమంత్రి తీరును దుయ్యబట్టారు. ఎన్నికల ముందు 6వేల పంచాయతీ సెక్రటరీ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం 2500 ఉద్యోగాలు మాత్రమే ఉన్నాయని, అవికూడా ఔట్‌సోర్సింగ్ విధానంలో ఇస్తామని చెప్తున్న ప్రభుత్వం ఒక్కో ఉద్యోగాన్ని లక్షల్లో అమ్ముకునేందుకు టిడిపి నాయకులకు అప్పగించడం మంచిపద్ధతి కాదని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న లక్షా 40వేల ఉద్యోగాల్లో విభజన చట్టం ప్రకారం పోలీసు శాఖకు 30వేల ఉద్యోగాలు కల్పించాలని, కానీ, ఇంతవరకు ఒక్క ఉద్యోగం కూడా ఇచ్చిన పరిస్థితి కనిపించడం లేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే లక్షా 40వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికే హామీ ఇచ్చివున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంతాలి రఘు, ఎస్.సాయిరాంరెడ్డి, పి.నాగరాజు, వెంకటేశ్వర్లు, మురళి, సుబ్రహ్మణ్యం, సతీష్, గిరి, రాము, కిరణ్, ఈదల ధనుజారెడ్డి, దార్ల వెంకటేశ్వర్లు, అశోక్, నవీన్, మధు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యాపారం...

# సమాజానికి ప్రమాదం

## - జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు



పురస్కారాలందుకున్న విద్యార్థినీవిద్యార్థులతో జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి

విద్య వ్యాపారంగా మారితే సమాజం స్వార్థంతో నిండిపోతుందని జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో ఈ ఏడాది పదో తరగతి ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 125మంది జడ్పీ హైస్కూల్స్ విద్యార్థులకు, అలాగే వంద శాతం ఉత్తీర్ణత సాధించిన జడ్పీ హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులకు పురస్కారాల ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి 125మంది విద్యార్థులకు 3లక్షల నగదు పురస్కారాలు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

అలాగే ప్రధానోపాధ్యాయులను ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి మూలస్థంభంలా నిలవాల్సిన చదువులు వ్యాపారంగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తన సొంత నిధులతో జడ్పీ హైస్కూళ్ళలో చదివే ప్రతిభావంతులను ప్రోత్సహిస్తున్న జడ్పీ ఛైర్మెన్ బి.రాఘవేంద్రరెడ్డిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను పెంచి విద్యాబోధన మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను నాశనం చేస్తూ కార్పొరేట్ విద్యా వ్యాపారానికి కొమ్ము కాస్తున్నాయన్నారు. చాలా ప్రభుత్వ పాఠశాలల్లో నేటికీ కనీస వసతులు ఉండడం లేదని ఆవేదన చెందారు. పది పాసైన విద్యార్థులకు ఇంటర్ ఎక్కడ చదవాలనేది పెద్ద పజిల్‌గా మారిందని, హైస్కూళ్లలోనే ఇంటర్మీడియట్‌ను ప్రవేశపెడితే విద్యార్థులకు దారి చూపినట్లేనని అన్నారు. ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ చదువులను ప్రోత్సహించే కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఇఒ శామ్యూల్, జడ్పీ డిప్యూటీ సిఇఒ వసుంధర తదితరులు పాల్గొన్నారు.

## మోకాళ్ల శస్త్రచికిత్సల్లో...

# విప్లవాత్మక మార్పుకు శ్రీకారం

## - డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి




అరిగిపోయిన మోకాళ్ళను తిరిగి దారిలో పెట్టడానికి వాటికి మునుపటి శక్తిని కలిగించడానికి మోకాళ్ళ శస్త్ర చికిత్సల్లో అధునాతన విధానాన్ని అమలులోకి తెచ్చినట్లు ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాధారణంగా అధికంగా మోకాళ్ల నొప్పులతో బాధపడేవారిలో మోకాళ్ల ఎముక అరిగిపోయి, దాని చుట్టూ ఉన్న కణజాలం కూడా దెబ్బతింటుందని అన్నారు. ఇటువంటి వారికి మామూలుగా అయితే మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స చేస్తారని, అయితే ఇకపై ఆ అవసరం లేకుండా అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ నూతన విధానాన్ని పరిచయం చేస్తుందన్నారు. మోకాళ్ళు అరిగిపోయిన భాగంలో పాక్షికంగా శస్త్రచికిత్స చేసి, ఎముకల చుట్టూ ఉన్న కణజాలాన్ని తిరిగి పునరుద్ధరించి, వారిని యథాస్థితికి తీసుకురావడమే ఈ నూతన విధాన లక్ష్యమని అన్నారు. పాక్షిక మోకాళ్ల శస్త్రచికిత్స ద్వారా నొప్పి తక్కువగా ఉండటంతోపాటూ, రక్తస్రావం చాలా తక్కువ మోతాదులో ఉంటుందని, రోగి అతి త్వరగా కోలుకోవడం జరుగుతుందని డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. అతితక్కువ ఖర్చుతో, మోకాళ్ల అరుగుదల, నొప్పులతో బాధపడేవారికి, అతి త్వరగా కోలుకునే ఈ నూతన విధానం జిల్లాలో తొలిసారిగా నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ పరిచయం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు అపోలో వైద్యులు డాక్టర్ వివేకానందరెడ్డి, డాక్టర్ శశిధర్‌రెడ్డి మరియు డాక్టర్ షాహుల్ ఆసుపత్రి యూనిట్ హెడ్ నవీన్, ఆసుపత్రి మెడికల్ సుపెరిటెండెంట్ డాక్టర్ శ్వేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో ముగిసిన వెల్డింగ్ శిక్షణా శిబిరం



శ్రీసిటీలోని సీమన్స్ సాంకేతిక నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రంలో నిర్వహించబడిన 15 రోజుల వెల్డింగ్ శిక్షణా శిబిరం సోమవారం ముగిసింది. తడ ప్రభుత్వ ఐ.టీ.ఐ.లో వెల్డింగ్ ట్రేడ్‌లో ఆఖరి సంవత్సరం చదువుతున్న 19 మంది విద్యార్థులు ఈ శిబిరంలో శిక్షణ పొందారు. వెల్డింగ్‌కు సంబంధించిన సాంకేతికపరమైన ప్రాథమిక సూత్రాలు, భద్రతా అంశాలు, వివిధ వెల్డింగ్ పద్ధతులు, లోపాలు కనుగొని సరిచేయటం వంటి పలు విషయాలపై చక్కని అవగాహన కలిగించటమే కాకుండా, పరిశ్రమలలో వెల్డింగ్ అవసరాలు, మెళుకువలు వంటి విషయాలను బోధించారు. పారిశ్రామిక అవసరాలకు తగినట్లుగా మానవ వనరులను వృద్ధి పరచేందుకై సీమన్స్ సంస్థ మరియు శ్రీసిటీల సహకారంతో, రాష్ట్ర ప్రభుత్వం శ్రీసిటీలో ఈ సాంకేతిక నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పిందని, ఇక్కడ ఇస్తున్న మంచి శిక్షణ వలన విద్యార్థులు వృత్తిలో మంచి నైపుణ్యాన్ని సాధిస్తున్నందుకు తమకు మిక్కిలి ఆనందంగా ఉన్నదని శ్రీసిటీ యం.డి రవీంద్ర సన్నారెడ్డి అన్నారు.

# మోడీ ప్రతిష్టను దిగజారుస్తున్నారు

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనను గాలికొదిలేసి, నవనిర్మాణ దీక్షల పేరుతో మోదీని విమర్శిస్తూ ఆయన ప్రతిష్టను దిగజారుస్తున్నారని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిడతల రమేష్ పేర్కొన్నారు. ఈ నెల 11న బీజేపీ సభ్యులతో కలిసి నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రధానిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు మరువక ముందే మంత్రి అఖిలప్రియ మోదీపై ఆరోపణలు చేయడం దారుణమన్నారు. తన మాటలకు కట్టుబడి ఉంటానని చెప్పినందువల్ల సుమోటోగా ఆమెపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటికొక ఉద్యోగం ఇస్తానని, అద్భుతంగా రాజధానిని నిర్మిస్తానని ఇలా ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. జిల్లాను ఓడిఎఫ్(బహిరంగ మలవిసర్జన రహితం)గా ప్రకటించినా చాలా గ్రామాల్లో ఇంకా మరుగుదొడ్ల నిర్మాణాలు జరగలేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు మంజూరు చేస్తే అదంతా తన గొప్పతనమని ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. అన్నం శ్రీనివాసులు, పనబాక కోటేశ్వరరావు, కొప్పెర కోటేశ్వరరావు, సాయి శ్రీనివాసులు, మొద్దు శ్రీనివాసులు, బండారి సురేష్, శ్యాంబాబు పాల్గొన్నారు.

# నాయకుడిగా ఎదుగుతూ..

(మొదటి పేజీ తరువాయి)

వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర పశ్చిమగోదావరిలో ముగిసి తూర్పుగోదావరిలో అడుగుపెట్టింది. 12వ తేదీ ఉదయం కొవ్వూరు వద్ద గోదావరి తల్లికి జలహారతి ఇచ్చిన అనంతరం గోదావరి రోడ్‌కంబైన్ వంతెన మీదుగా జగన్ తూర్పుగోదావరిలోకి ప్రవేశించాడు. ఈ సందర్భంగా బ్రిడ్జిపై ఆయన వెంట నడిచిన జనప్రవాహానికి ఆ వంతెనే కదిలింది. లక్షలాదిగా ప్రజలు జగన్‌ను స్వాగతించారు. ఆయన వెంట నడిచారు. క్రింద జలగోదావరి, పైన జనగోదావరి అన్నంతగా జన సమూహం. కోనసీమ ఈసారి ఈ రాయలసీమ బిడ్డను ఆదరిస్తుందనడానికి నిలువెత్తు సంకేతం ఇది. పశ్చిమగోదావరిలో జగన్‌కు కనీవినీ ఎరుగని ఆదరణ లభించింది. ఒకదానికి మించి ఒకటి ఆయన సభలు విజయవంతమయ్యాయి. తూర్పుగోదావరిలోనూ జగన్‌కు అపూర్వ ఆదరణ లభిస్తోంది.

ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెదుక్కోవాలంటారు పెద్దలు. 2014 ఎన్నికల్లో జగన్ గోదావరి జిల్లాల్లోనే నష్టపోయాడు. ఇప్పుడు రాయలసీమ, ప్రకాశం, నెల్లూరుజిల్లాల్లో వైసిపి పటిష్టంగానే వుంది. కృష్ణా నదికి దక్షిణం వైపు జిల్లాల్లో ఈసారి కూడా 2014 ఎన్నికల్లో వచ్చిన సీట్లకు ఏ మాత్రం తగ్గవు. ఉభయగోదావరి జిల్లాల ప్రజల మనసులను గెలవగలిగితే జగన్ 2019 ఎన్నికలను గెలిచినట్లే! జగన్‌ను ముంచినా, తేల్చినా అంతా గోదావరి పుణ్యమే!

ఇడుపులపాయ నుండి మొదలైన జగన్ పాదయాత్ర రోజులు మారేకొద్దీ జిల్లాల ఎల్లలు దాటే కొద్దీ ఉధృతమవుతోంది. ప్రజా ప్రభంజనం పోటెత్తుతోంది. నడిచేకొద్దీ ఆయన నాయకుడిగా అంతకంతకూ ఎదుగుతున్నాడు. ప్రజల నమ్మకాన్ని పెంచుకుంటున్నాడు. అన్ని పక్షాలలో వున్న నాయకులు తనవైపు చూసేలా చేస్తున్నాడు. నాలుగేళ్ళ క్రితం జగన్‌కు అనుభవం లేదు అని ఓటేయడానికి వెనక్కు తగ్గిన వాళ్ళు కూడా ఇప్పుడు జగన్ పట్టుదల, వేలకిలోమీటర్ల దూరం నడుస్తున్న అతని మొండితనాన్ని చూసి నాయకుడంటే ఇతడేరా... రాజశేఖరరెడ్డిని తలపించే ప్రజానాయకుడవుతాడురా అని అంటున్నారు. 2003లో వై.యస్. ప్రజాప్రస్థానం పాదయాత్రను మరపించేలా జగన్ ప్రజాసంకల్ప పాదయాత్ర జరుగుతుందంటే అతిశయోక్తి కాదేమో!

# స్థానిక పోరుకు.. వెనకడుగు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలను నిర్వహించాలని, ఫలితాలను మాత్రం అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రకటించాలని తీర్పునిచ్చింది. దీంతో ముందుగా స్థానిక ఎన్నికలను నిర్వహించాల్సి వచ్చింది. దీని మూలంగా గ్రామాలలో గ్రూపులు ఏర్పడ్డాయి. వై.యస్. అభిమానులు కొన్నిచోట్ల స్థానికంగా వున్న పరిస్థితుల దృష్ట్యా తెలుగుదేశంలోకి వెళ్ళాల్సిన పరిస్థితులొచ్చాయి. స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశంకు పనిచేసిన వాళ్ళు అసెంబ్లీ ఎన్నికల్లోనూ అలాగే వుండిపోయారు. దానివల్ల వై.యస్. సానుభూతి ప్రభావం పనిచేయకుండాపోయింది. పోయినసారి అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే స్థానిక ఎన్నికలు నిర్వహించడం తెలుగుదేశంకు బాగా కలిసొచ్చింది!

మరి ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల పరిస్థితి ఏంటన్నది ప్రశ్న? పంచాయితీ ఎన్నికల గడువు అయిపోయింది. రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయితీ ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తోంది. కాని, ముందుగా పంచాయితీ ఎన్నికలు నిర్వహిస్తే ఫలితాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వస్తాయనే అంచనా వుంది. పంచాయితీ ఎన్నికలు పూర్తిగా గ్రామాలు, పల్లెటూర్లకు సంబంధించినవి. ఎక్కువగా రైతులతో సంబంధం వున్న ఎన్నికలు. ఈ నాలుగేళ్ళలో రైతాంగానికి ఒరిగిందేమీ లేదు. ఋణమాఫీ పెద్ద ఫ్లాప్. ఇక పంటలకు గిట్టుబాటుధరలు లేకపోవడం వంటి సమస్యలు వుండనే వున్నాయి. పంచాయితీల తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికలకు వెళ్ళాలి. ఇవి కూడా గ్రామాలకు సంబంధించిన ఎన్నికలే! ఈ ఎన్నికలు నిర్వహించినా ప్రభుత్వానికి ప్రతికూల ఫలితాలే వస్తాయి. ఈ రెండు ఎన్నికల ప్రభావం తర్వాత నిర్వహించాల్సిన కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలపై పడుతుంది. ఇక్కడ కూడా ప్రభుత్వ వ్యతిరేకత బయటపడితే రాష్ట్ర వ్యాప్తంగా ఓటింగ్ సరళి ఆటోమేటిక్‌గా మారిపోతుంది. ఇది ఊహించబట్టే చంద్రబాబు అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు స్థానిక ఎన్నికలకు వెళ్ళడానికి అయిష్టంగా వున్నట్లు తెలుస్తోంది.

# అలసత్వం వహిస్తే క్రమ-శిక్షణా చర్యలు

## - రెవెన్యూ అధికారుల తీరుపై కలెక్టర్ మండిపాటు



రెవెన్యూ పనుల పురోగతిలో అలసత్వం వహించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు స్పష్టం చేశారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన కొడవలూరు, బుచ్చి, నెల్లూరు మండలాలకు చెందిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ అధికారుల పనితీరు బాగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరు మెరుగు పరచుకోకపోతే చర్యలు తప్పవన్నారు. ఏప్రిల్ నుంచి మే 31వరకు 'మీ భూమికి భరోసా' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఏర్పాటుచేసినప్పుడు రెవెన్యూ అధికారులు సక్రమంగా పనులు నిర్వహించలేదన్నారు. చుక్కల భూముల అర్జీదారులకు 30 రోజుల్లో నోటీసులు ఇచ్చి విచారించాలన్నారు. ఆమేరకు అధికారులకు కలెక్టర్ తగు సూచనలిచ్చారు. ప్రతి గ్రామంలోనూ ఇళ్ళ స్థలాలు లేనివారికి కొత్తగా స్థలాలను అధికారులు గుర్తించాలన్నారు. పల్స్ సర్వే డేటాలో ఉన్న లబ్దిదారులకే భూములను పంపిణీ చేయాలన్నారు. సేకరించిన భూముల్లో ఆక్రమణకు గురికాని భూముల జాబితాను తయారుచేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.వెట్రి సెల్వి, డిఆర్‌ఓ వెంకటసుబ్బయ్య, గృహ నిర్మాణాల శాఖ పి.డి ప్రసాద్, ఆర్డీఓ డి.హరిత తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు విద్యార్థులకు కార్పొరేట్ విద్య

జిల్లాలోని పోలీసు సిబ్బంది పిల్లలకు జిల్లా పోలీసు అధికారుల సంఘం చొరవతో కార్పొరేట్ విద్యను అందిస్తున్నారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారితో పాటు ఉత్తీర్ణత సాధించిన వారికి సైతం సీట్లు కేటాయించారు. జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ ఆదేశాల మేరకు ఇటీవల నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్‌లో అదనపు ఎస్పీ బి.శరత్‌బాబు, నగర డిఎస్పీ ఎన్.బి.ఎం.మురళీకృష్ణ, ఏపి పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇందుకు సంబంధించిన జాబితాను నెల్లూరు నగరంలోని కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలకు పంపగా విద్యార్థులకు సీట్లు కేటాయిస్తూ ఈ నెల 11న తుది జాబితాను విడుదల చేసినట్లు పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన 70మంది విద్యార్థులకు ఉచితంగా, ఉత్తీర్ణత పొందిన 40మంది విద్యార్థులకు 50శాతం రాయితీతో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు కల్పించినట్లుగా వివరించారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలతో ఎస్పీ రామకృష్ణ చర్చించి పదిలోపు విద్యార్థులకు 25శాతం నుంచి 70శాతం వరకు రాయితీ కల్పించారని తెలిపారు. విద్యార్థుల సంక్షేమానికి కృషి చేసిన జిల్లా ఎస్పీ, పోలీసు అధికారులు, ముందుకొచ్చిన కళాశాలల, పాఠశాలల యాజమాన్యాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# 17న మెగా ఉచితవైద్యశిబిరం

నెల్లూరు ట్రంకురోడ్డులోని సిటీ మెడికల్స్ వ్యవస్థాపకుడు సన్నపరెడ్డి వెంకటరెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 17న అపోలో ఆసుపత్రి డాక్టర్లచే మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. స్థానిక గాంధీబొమ్మ వద్ద ఉన్న శ్రీ సాయిబాబా మందిరం ప్రాంగణంలో ఆరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల దాకా జరిగే ఈ శిబిరంలో కిడ్నీ, లివర్, మెదడు, కీళ్ళు, ఎముకలు, కంటిపరీక్షలు, దంతపరీక్షలు, ఊపిరితిత్తులు, బి.పి, డయాబెటిస్, కాన్పులు, గర్భకోశ సంబంధిత వ్యాధులకు, జీర్ణకోశ సంబంధిత వ్యాధులకు పరీక్షలు జరిపి మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ శిబిరంలో పాల్గొనదలచిన వారు ఆరోజు ఉదయం 8 గంటలకు వచ్చి తమ పేర్లు నమోదుచేసుకోవాలన్నారు. 18వ తేదీ ఉదయం 11 గంటల నుంచి శ్రీ సాయిబాబా మందిరంలో పేదలకు అన్నదానం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# పని గడ్కరీది.. ఫోజు బాబుది!

(మొదటి పేజీ తరువాయి)

హఠాన్మరణం చెందారు. పోలవరం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. గత యూపిఏ ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలలో పోలవరం ప్రాజెక్ట్‌ను చేర్చడం తెలిసిందే! 2014 ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఆచరణలోకి తెచ్చింది. అయితే ప్రత్యేకహోదా డిమాండ్‌ను వదిలేసి ప్రత్యేకప్యాకేజీకి అంగీకరించిన చంద్రబాబు పోలవరం ప్రాజెక్ట్‌ను కూడా తమకు అప్పగిస్తే తామే కట్టుకుంటామని చెప్పాడు. ఇది కేంద్రం మొదలుపెట్టి పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్. చంద్రబాబు ఏ ఉద్దేశ్యంతో ఆ ప్రాజెక్ట్ మేం చేస్తామన్నాడో ఆ తర్వాత బీజేపీ నాయకులకు తెలిసింది. 16వేల కోట్ల అంచనాలను చంద్రబాబు 56వేల కోట్లకు తీసుకుపోయాడు. ఈ అంచనాలను చూసి కేంద్ర పెద్దలే కళ్ళు తేలేసారు. ప్రాజెక్ట్‌పై పెట్టిన ఖర్చుకు కేంద్రం యుసిఆర్‌లు అడగడం, పక్కాగా లెక్కలు చెప్పలేక చేతులెత్తేసిన చంద్రబాబు అసెంబ్లీలోనే పోలవరం ప్రాజెక్ట్ బాధ్యతను కేంద్రమే చూసుకోవాలని చెప్పడం జరిగింది. పోలవరం ప్రాజెక్ట్‌ను దక్కించుకున్న 'ట్రాన్స్‌ట్రాయ్' కంపెనీ ఈ ప్రాజెక్ట్ పనులను నత్తనడకన సాగిస్తుంటే అప్పుడు కేంద్ర జలవనరుల శాఖామంత్రి నితిన్ గడ్కరీ జోక్యం చేసుకున్నారు. దేశంలో ఎన్నో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లను వేగవంతంగా పూర్తి చేసిన నవయుగ ఇంజనీరింగ్ యాజమాన్యాన్ని ఢిల్లీకి పిలిపించుకున్నారు. ఒక్క ఏడాదిలో పోలవరం కాంక్రీట్ పనులను పూర్తి చేయగలరా అని వారిని అడిగాడు. అందుకు వాళ్ళు పాతరేట్లతోనే డ్యాం కాంక్రీట్ పని పూర్తి చేయడానికి అంగీకారం తెలిపారు. దీంతో ఎంఓయూ కుదిరింది. ఈ పనితో లాభం వస్తుందా లేదా అని ఆలోచించకుండా నవయుగ సంస్థ రంగంలోకి దిగింది. వేలమంది సిబ్బందిని, ఇంజనీర్లను, వేల సంఖ్యలో వాహనాలను, మిషనరీని సిద్ధం చేసింది. తక్షణమే కాంక్రీట్ పనులను మొదలుపెట్టింది. రేయింబవళ్ళు పనిచేస్తూ నితిన్‌గడ్కరీకి ఇచ్చిన మాటను నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తుంది.

పోలవరం ప్రాజెక్ట్ వద్ద ఇప్పుడు ఏ పని వేగవంతంగా జరుగుతున్నా అది నితిన్‌గడ్కరీ పుణ్యమే. పని ఆయనదైతే ఫోజులు మాత్రం చంద్రబాబువయ్యాయి. దయాఫ్రంవాల్ అంటూ శంకుస్థాపన... ప్రపంచ రికార్డు నిర్మాణం అంటూ పచ్చ మీడియాలో వార్తలు... సొమ్మొకడిది సోకొకడిది అంటే ఇదేనేమో!


విజయ లేబొరేటరి
(క్యాన్సర్ రోగ నిర్ధారణ కేంద్రం)
ఇందిరాభవన్ రోడ్డు, నెల్లూరు - 1

33వ వార్షికోత్సవం
(జూన్ 16, 1985-2018)

సందర్భంగా మా అభివృద్ధికి కారకులైన అందరికి మా హృదయ పూర్వక కృతజ్ఞతాభివందనములు

సదా మీ సేవలో

డా॥ యం.పెంచలరెడ్డి
M.B.B.S., M.D., D.C.P.
రోగ నిర్ధారణ & నివారణ శాస్త్రవేత్త

డా॥ యం.హరికృష్ణారెడ్డి
M.B.B.S., D.N.B.,
ప్లాస్టిక్ & కాస్మటిక్ సర్జన్

డా॥ యం.విజయలక్ష్మి
M.B.B.S., M.D., (Pathology)
రోగ & క్యాన్సర్ నిర్ధారణ శాస్త్రవేత్త

డా॥ యం.రాజశేఖర్‌రెడ్డి
M.B.B.S., D.N.B.,
పురిటి & చిన్నపిల్లల వైద్య నిపుణులు

రోగ నిర్ధారణకు, లావు తగ్గింపుకు, ప్లాస్టిక్ & కాస్మటిక్ సర్జరీలకు
సం.ప్ర. ఫోన్: 0861 - 2324405
సెల్: 98665 34908; 79892 23326

# సైకిల్ దిగినట్లే!

## ● వైసిపిలో చేరడానికి ఇంకా కుదరని ముహూర్తం



దాదాపు రెండు నెలలుగా ఒక వార్త జిల్లా రాజకీయాలలోనే కాదు, రాష్ట్ర రాజకీయాలలో కూడా హల్‌చల్ చేస్తోంది. అదే మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశం పార్టీని వీడనున్నారని... వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరనున్నారని. ఇవన్నీ మీడియాలో మాత్రమే వచ్చాయి. ఆనం వివేకానందరెడ్డి మరణానికి ముందే టీడీపీపై ఆనం సోదరులు అసంతృప్తితో వున్నారన్న వార్త గుప్పుమంది. ఇది తెలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పటికప్పుడు జాగ్రత్త పడ్డారు. హైదరాబాద్‌లో ఆసుపత్రిలో వున్న సమయంలో వివేకాను పరామర్శించడానికి వెళ్ళారు. వివేకా అంత్యక్రియలు రోజున నెల్లూరొచ్చారు. ఆనం కుటుంబసభ్యులతో దాదాపు ముప్పావుగంట చర్చించి రాజకీయంగా మీకు అండగా వుంటానని భరోసా ఇచ్చారు. పార్టీలో తగిన గౌరవం కల్పిస్తానని హామీ ఇచ్చాడు. ఆనం సోదరులు పార్టీని వీడిపోయే పరిస్థితి దాకా ఎందుకు తీసుకొచ్చారంటూ జిల్లా మంత్రులిద్దరినీ పార్టీ జిల్లా అధ్యక్షుడిని చంద్రబాబు తిట్టారు. నచ్చజెప్పి ఆనంను పార్టీలో నిలబెట్టుకున్నా మనుకునేంతలోనే కథ అడ్డం తిరిగింది. గత నెలలో నిర్వహించిన ఆత్మకూరు, నెల్లూరురూరల్ నియోజకవర్గాల మహానాడుల్లో పాల్గొన్న ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశం ప్రభుత్వంతో పాటు జిల్లా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మీద విమర్శలు ఎక్కుపెట్టాడు. తెలుగుదేశం పార్టీ పరంగా ఆయన పాల్గొన్న చివరి కార్యక్రమాలవే! ఆ తర్వాత నెల్లూరులో జరిగిన జిల్లా మహానాడుకు గాని, విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి మహానాడుకు గాని ఆయన హాజరు కాలేదు. దాంతోనే ఆయన ఇక తెలుగుదేశంలో వుండడనే విషయం అర్థమైంది.

### బొత్సనే వారధి...

వాస్తవానికి ఆనం సోదరులను పార్టీలో చేర్చుకోవడానికి వైసిపి అగ్ర నాయకత్వంలో అంతగా ఆసక్తి లేదు, ఎందుకంటే గతంలో వై.యస్ కుటుంబంపై వారు చేసిన వ్యక్తిగత విమర్శలే కారణం. అయితే 2014లో ఇలా పట్టించుకుని కొందరిని పార్టీలోకి తీసుకోక పోబట్టే నష్టపోయామని, రాజకీయాలలో ఇవన్నీ కామన్ అని బొత్స వంటి నాయకులు జగన్‌కు నచ్చజెప్పి ఆనంకు వైసిపిలో లైన్‌క్లియర్ చేసారు. టీడీపీలో వున్నా ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరులో వైసిపికి బలమైన ప్రత్యర్థి అవుతాడు. అతనిని వైసిపిలోకి లాక్కుంటే టీడీపీకి బలమైన అభ్యర్థే వుండడు. ఈ లాజిక్‌తోనే ఆయనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది.

### రాజీనామానే తరువాయి...

తాను పార్టీ మారడంపై రెండు నెలలుగా వూహాగానాలు జరుగుతున్నా ఆనం రామనారాయణరెడ్డి ఎక్కడా దీనిపై బహిరంగంగా మాట్లాడలేదు. కాని 13వ తేదీ తొలిసారిగా మీడియా ముందు నోరు విప్పాడు. తెలుగుదేశం పార్టీలో ఇమడలేక పోతున్నామని చెప్పకనే తన ఉద్దేశ్యాన్ని చెప్పాడు. ఈ విషయమై ఆత్మకూరు నియోజక వర్గంలోని తన అనుచరులతో పాటు జిల్లా వ్యాప్తంగా వున్న తన అనుచరులు, మిత్రులతో సంప్రదింపులు జరుపుతున్నాడు. త్వరలోనే టీడీపీకి రాజీనామా చేసే అవకాశాలున్నాయి. మరి వైకాపాలో ఎప్పుడు చేరుతాడన్నది నిర్ణయం జరగాల్సివుంది. జూలై 8వ తేదీ వై.యస్. జయంతి రోజు ఒకవేళ జగన్ సమక్షంలో ఆయన పాదయాత్రలో ఎక్కడుంటే అక్కడకు వెళ్ళి చేరే అవకాశాలున్నాయి.

### ఏ సీటు నుండి పోటీ...

ఆనం రామనారాయణరెడ్డిని వైసిపిలోకి తీసుకోవాలన్న ఆలోచనకు బీజం వేసింది ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి. వైసిపి అధికారంలోకి రావాలని, జగన్ సీఎం కావాలనే లక్ష్యంతో వున్నాడు. అందుకే ఆనం పార్టీలోకి వస్తే ఆత్మకూరు సీటును వదులుకోవడానికి సిద్ధమన్న సంకేతాలు ఇచ్చాడు. అయితే... పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాలున్న సమయంలో సిటింగ్ సీటు వదులుకోవడం ఎందుకని కుటుంబసభ్యులు చేసిన సూచనతో తాను ఆత్మకూరు నుండే పోటీ చేస్తానని మళ్ళీ స్టేట్‌మెంటిచ్చాడు. ఇప్పుడు రామనారాయణరెడ్డికి సీటు ఎక్కడా అన్నది మేకపాటి గౌతం నిర్ణయంపై కూడా ఆధారపడి వుంటుంది. మేకపాటి కుటుంబసభ్యులకు 2014ఎన్నికల్లో లోక్‌సభ, రెండు అసెంబ్లీ సీట్లిచ్చారు. ఈసారి కూడా వారికి మూడుసీట్లే ఇస్తే రామనారాయణరెడ్డికి వెంకటగిరి నుండి పోటీ చేసే ఛాన్స్ వుంటుంది. గౌతం ఆత్మకూరును వదులుకుంటే ఆనం ఆత్మకూరు నుండే పోటీ చేయాల్సి రావచ్చు. ఇది కాకుండా మేకపాటి కుటుంబసభ్యులు అసెంబ్లీల వరకే పోటీచేసినా లేదా ఒకరు నరసారావుపేట లోక్‌సభకు వెళ్ళినా ఆనంకు నెల్లూరు లోక్‌సభకు పోటీ చేసే అవకాశం కలగొచ్చు.


### టీడీపీలో ఎవరి వైఫల్యం...

2015లో ఆనం సోదరులు తెలుగుదేశంలో చేరారు. ఆరోజు అవసరం లేక పోయినా ఆ నిర్ణయం తీసుకున్నారు. ఈ మూడేళ్ళు కూడా కాంగ్రెస్‌పార్టీలోనే ఉండుంటే వారి మీద గౌరవంగా వుండేది. చంద్రబాబుతో పాటు జిల్లా మంత్రి నారాయణ కూడా వారిని టీడీపీలోకి తీసుకెళ్ళడంలో ప్రధానపాత్ర పోషించారు. ఆరోజు మంత్రిగా కాదు, ఎమ్మెల్సీగా కూడా లేనటువంటి సోమిరెడ్డికి ఈ విషయంలో ఎటువంటి పాత్ర లేదు. ఆనంకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చంద్రబాబు, నారాయణలు విఫలమయ్యారు. కాని, ఆనం మాత్రం పార్టీని వదిలే ముందు సోమిరెడ్డిని తిట్టిపోతున్నాడు. ఇదే పెద్ద కామెడీ!

## విపిఆర్‌కి

# నాటా జీవితసాఫల్య పురస్కారం

## (LIFE TIME ACHIEVMENT AWARD)




***నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (నాటా) ప్రతీ ద్వైవార్షిక వేడుకలలో అందజేసే ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ అవార్డు ఈసారి ప్రముఖ దాత, పారిశ్రామికవేత్త, రాజ్యసభ సభ్యుడు, నెల్లూరీయుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందుకోనున్నారు.***

ఈ అవార్డు అందుకుంటున్న నెల్లూరీయులలో ఈయన 4వ వాడు. 2012లో తొలిసారిగా 'నాటా' ఆవిర్భావ సభలో సుప్రసిద్ధ శాస్త్రవేత్త "చీప్" రెడ్డిగా విఖ్యాతి గాంచిన మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఈ అవార్డు అందుకోగా, 2014లో రెండవ అవార్డు భారతీయ సినిమా గాయకుడు యస్.పి.బాలసుబ్రహ్మణ్యంకు లభించింది. 2016లో మూడవ అవార్డు "ఖైదీ" సినిమా ద్వారా చిరంజీవికి సినీ భవిష్యత్తును ప్రసాదించిన దర్శకుడు ఎ.కోదండరామిరెడ్డిని వరించింది. ఇప్పటివరకు అవార్డులు అందుకున్న ముగ్గురూ నెల్లూరీయులే కాగా, ఈసారి 2018కి గాను అవార్డు అందుకోబోతున్నది కూడా మన నెల్లూరీయుడే కావడం గమనార్హం, గర్వకారణం కూడా. 2018 జూలై 6, 7, 8వ తేదీలలో అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రం, ఫిలడల్ఫియా నగరంలో జరగనున్న "నాటా" 'ద్వైవార్షిక మహాసభ'లలో మూడవరోజు జూలై 8వ తేదీ జరగబోయే ముగింపు సభ వేదికపై నుండి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ అవార్డును అందుకోనున్నారు.

మొదటి నుండి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి అంటే చాలా ఇష్టం. వై.యస్. కూడా ప్రభాకర్‌రెడ్డిని అంతే అభిమానించేవారు. యాదృచ్ఛికమో లేక భగవత్ సంకల్పమో తెలియదు కాని వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీ నుండి రాజ్యసభ సభ్యుడిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎంపిక కావడం, అదే యేడాది "నాటా జీవిత సాఫల్య పురస్కారానికి" ఆయన ఎంపిక కావడం ఆ అవార్డుని జూలై 8న డా॥ వై.యస్. రాజశేఖరరెడ్డి గారి జయంతి రోజున అందుకోబోవడం నిజంగా ప్రభాకర్ రెడ్డికి వై.యస్.తో వున్న అనుబంధానికి చిహ్నంగా నిలుస్తుంది. అపరిమితమైన సేవా కార్యక్రమాలతో సేవకేదీ కాదు అనర్హం అన్నట్లుగా అన్ని రంగాలలో తన సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పిస్తూ నెల్లూరీయుల మనసుల్లో పదిలమైన స్థానాన్ని ఏర్పరచుకున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకమైన 'నాటా' "లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు" అందుకుంటున్న తరుణంలో 'లాయర్' అభినందనలు.

## జై జన్మభూమి అంటున్న...

# ఈ 'అమెరికా అబ్బాయి'

### హైదరాబాదు నుండి నెల్లూరుకు తన సంస్థను తెచ్చేసుకున్న మనుక్రాంత్‌రెడ్డి



***మనుక్రాంత్‌రెడ్డి... పుట్టింది పెరిగింది చదివింది అంతా ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోనే. ఆ తరువాత ఉద్యోగం కోసం అమెరికాకు వెళ్ళి అక్కడ తానే స్వంతంగా ఓ కంపెనీని ఏర్పాటు చేసుకుని ఆ తరువాత కాలంలో హైదరాబాదులోనూ మరో సంస్థను స్థాపించి ఎంతోకొంత మందికి జీవనోపాధి కల్పిస్తూ సంతృప్తి పొందుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.***


అయితే ఇప్పుడు మనుకి ఓ ఆలోచన పుట్టింది. మనకి జన్మనిచ్చిన భూమికి మనమేం చేస్తున్నామన్న తపన ఆ అబ్బాయిలో మొదలయ్యింది. అంతే అనుకున్న వెంటనే హైదరాబాద్‌లో వున్న తన మాక్షకామ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థని నెల్లూరుకు తరలించేశాడు. మొత్తం కంపెనీ చిరునామాని హైదరాబాద్ నుండి నెల్లూరుకు బదిలీ చేసేశాడు. అక్కడితో ఆగలేదు, తన ఊరికి తాను ఏదో ఒకటి చేయాలని బలంగా సంకల్పించాడు.

గురువారం మీడియా ముందు కొచ్చాడు. తాను మంచి భర్తగా, మంచి తండ్రిగా, మంచి బిడ్డగా, మంచి సోదరుడిగానే కాకుండా మంచి పౌరుడిగా ఎదగాలనుకుంటున్నానని, అనాథగా వున్న నవ్యాంధ్ర ప్రగతికి తానూ భాగస్వామిని కావాలనే ఉద్దేశ్యంతో తన స్వంత గడ్డ నెల్లూరుని వేదికగా ఎంచుకున్నానని ప్రకటించాడు.

తెలంగాణ నుండి తన సంస్థను తరలించడమే కాకుండా, ఇంకా ఇతర సంస్థలకు కూడా ప్రోద్భలాన్ని ఇస్తానని, తన విజయంతో వారికి స్ఫూర్తి కలిగించి వారి సంస్థలను కూడా నెల్లూరుకు తరలింపజేస్తానని ప్రతిజ్ఞపూనాడు. తనకున్న బంధాలు సంబంధాలతో నెల్లూరును కూడా ఓ సాఫ్ట్‌వేర్ హబ్‌గా చేయడానికి ప్రయత్నిస్తానని వాగ్దానం చేశాడు. ఇక్కడితో ఆ అబ్బాయి ఆగలేదండోయ్... "మన మను ఆర్గనైజేషన్" అంటూ ఓ సేవాసంస్థని ప్రారంభించాడు. ఈ సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలకు కూడా తాను శ్రీకారం చుట్టబోతున్నట్లు ప్రకటించాడు.

శుభం... మంచి ఆలోచన.

మనుక్రాంత్ నాన్న చెన్నారెడ్డి సుబ్బారెడ్డి, అమ్మ పెనుమల్లి మస్తానమ్మ ఇద్దరూ జిల్లా న్యాయమూర్తులుగా పనిచేసి పదవీ విరమణ పొందినవారే. వీరిద్దరి పెంపకంలో జన్మభూమి పట్ల మమకారాన్ని, సొంత ఊరి పట్ల అనురాగాన్ని పెంచుకుని జై జన్మభూమి అంటున్న మనుక్రాంత్‌కి ఆల్ ది బెస్ట్!



Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com